



పేదు కడుపు కందినది!

» 4 నెలలుగా అందని కందిపప్పు
» ఆగస్టు రేషన్‌లోనూ నిరాశేనా?
» ఇంకా ఖరారు కాని టెండర్లు

కలెక్టరేట్(కాకినాడ), జూలై 27(ఆంధ్రజ్యోతి): చాలా కాలంగా పేదింటికి కందిపప్పు దూరమైంది..గత వైసీపీ ప్రభుత్వంలో కందిపప్పు సరఫరా నిలిచిపోయింది..ఆ ప్రభుత్వంలో ఇచ్చినా అరకొరగానే ఉండేది.అయితే కూటమి ప్రభుత్వంలో కందిపప్పు తప్పనిసరిగా సరఫరా చేస్తారని అంతా ఆశించారు. అయితే అదీ నిరాశగానే మారింది. ఎందు కంటే గత నాలుగు నెలలుగా రేషన్ దుకాణాల్లో కందిపప్పు పంపిణీ జరగడం లేదు.ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో 15 లక్షల రేషన్‌కార్డులు ఉన్నాయి. కాకినాడ జిల్లాలో 6 లక్షల 54 వేల రేషన్‌కార్డులు ఉన్నాయి. వీరికి నెలకు 300 మెట్రిక్ టన్నులు కందిపప్పు కేటాయించాలి. డాక్టర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో 3 లక్షల 75 వేల రేషన్‌కార్డులు ఉన్నాయి.వీరికి 200 మెట్రిక్ టన్నుల కందిపప్పు కేటాయించాలి.తూర్పుగోదావరి జిల్లాలో 5 లక్షల రేషన్ కార్డులు ఉన్నాయి.వీరికి 300 మెట్రిక్ టన్నులు కావాలి. మొత్తంగా మూడు జిల్లాలకు కలిపి 800 మెట్రిక్ టన్నులు కందిపప్పు పంపిణీ నిమిత్తం ప్రభుత్వం సరఫరా చేయాలి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కొంత కాలం క్రమం తప్పకుండా కందిపప్పును ప్రజా పంపిణీ వ్యవస్థలో అందజేసింది. కానీ నాలుగు నెలలుగా కందిపప్పు సరఫరా నిలిచిపోయింది. అమరావతిలో కంది పప్పు టెండర్లు ఖరారు కాకపోవడంవల్ల సరఫరా నిలిచి పోయిందని అధికారులు అంటున్నారు.ఈ నేపథ్యంలో ప్రభుత్వ చౌకధరల దుకాణాలకు ఎప్పుడు సరఫరా అవుతుందో చెప్పలేక పోతున్నారు. రేషన్ దుకాణాల్లో కిలో కందిపప్పు రూ.67కే లబ్ధిదారులకు పంపిణీ చేస్తున్నారు. ప్రస్తుతం బహిరంగ మార్కెట్‌లో కిలో రూ.100 నుంచి రూ.110 వరకు ధర పలుకుతోంది. ఆగస్టులోనైనా పంపిణీ జరుగుతుం దని లబ్ధిదారులు ఆశగా చూస్తు న్నారు. వచ్చే నెలలో కూడా కందిపప్పు సరఫరా అయ్యే పరిస్థితి కనిపించడం లేదని అధికారులు అంటున్నారు.గత వైసీపీ ప్రభు త్వంలో ఒక నెల కంది పప్పు ఇస్తే రెండు నెలలు కోత విధించేవారు.కూటమి ప్రభు త్వం వచ్చిన తర్వాత క్రమం తప్పకుండా పంపిణీ చేసినప్పటికీ నాలుగు నెలలుగా కంది పప్పు సరఫరాకావడంలేదు. కాకినాడ జిల్లా సివిల్ సప్లయిస్ కార్పొరేషన్ మేనేజర్ దేవుల నాయక్‌ను సంప్రదించగా ఈ నెల కంది పప్పు కేటాయింపులు జరగలేదన్నారు. దీంతో ఆగస్టులో అందే పరిస్థితి కానరావడంలేదు.

నిండు గోదావరి

ధవళేశ్వరం, జూలై 27(ఆంధ్రజ్యోతి): ఎగువ నుంచి వచ్చి చేరుతున్న వరదతో తూర్పుగోదావరి జిల్లా ధవళేశ్వరం వద్ద గోదావరి ఉధృతంగా ప్రవహిస్తోంది. కాటన్ బ్యారేజ్ నుంచి ఆదివారం ఉదయం 5.46 లక్షల క్యూసెక్కులు దిగువకు విడుదల చేశారు. అయితే సాయంత్రానికి ఉధృతి మరింత పెరగడంతో కాటన్ బ్యారేజ్ మొత్తం 175 గేట్లను 1.5 మీటర్లు పైకి ఎత్తి 6,18,044 క్యూసెక్కులు దిగువకు విడుదల చేస్తున్నారు. ధవళేశ్వరం వద్ద గోదావరి నీటి మట్టం 10.90 అడుగులుగా నమోదైంది. ఎగువున అన్ని ప్రాంతాల్లో గోదావరి నీటిమట్టం తగ్గుముఖం పట్టింది. భద్రాచలం వద్ద 35.60 అడుగుల వరకు పెరిగిన నీటిమట్టం ఆపై తగ్గుముఖం పట్టి ఆదివారం సాయంత్రానికి 34.60 అడుగులకు చేరుకుంది. దీంతో సోమవారం వరద మరింత పెరిగే అవకాశం ఉంది.


ధవళేశ్వరం బ్యారేజీ వద్ద గోదావరి ఉధృతి



అమ్మబడును!
అమ్మతనానికో రేటు

మీకు ఆడబిడ్డ కావాలా..? మగ బిడ్డ కావాలా..? లేదంటే ఒకేసారి అయిపోతోంది.. కవల పిల్లలు కావా లా? మగ బిడ్డకైతే ఒక రేటు.. ఆడ బిడ్డకైతే మరో రేటు.. కవల పిల్లలకైతే ఒక రేటు.. ఇలా అమ్మత నానికి రేటు కట్టేశారు.. వైద్యం పేరుతో దందాకు తెర లేపారు.. ఇష్టానుసారం దోచేస్తున్నారు. ఇది ఎంత వరకు కరెక్ట్ అనేది దంపతులు కూడా ఆలోచించుకో లేకపోతున్నారు. పిల్లలు కావాలనే ఆశతో వాళ్లు ఏం చెబితే దానికి ఊకొడుతూ లక్షలు పోస్తున్నారు.

ఏమిటీ ఐవీఎఫ్, ఐయూఐ

పిల్లల కోసం వచ్చే దంపతులకు ఫెర్టిలిటీ, సంతాన సాఫల్య కేంద్రాల్లో రెండు రకాల పద్ధతులను అవలంభిస్తారు. మహిళల గర్భాశయంలో ఆపరేషన్ చేయడానికి వీలులేని చిన్నచిన్న కణుతులు లేదా సమస్యలు ఉండడం, గర్భాశయ ముఖద్వారం వద్ద చర్మం మం దంగా ఉండడం, పురుషుల వీర్యకణాల్లో కదలిక తక్కువగా ఉండడం, అన్నీ సక్రమంగా ఉన్నా ఫలదీకరణ పూర్తిస్థాయిలో జరగకపోవడం వంటి సమస్యలు ఉన్న వారికి పిల్లలు పుట్టడానికి ఐయూఐ(ఇంట్రా యుటిరైన్ ఇన్‌సెమినేషన్), ఐవీఎఫ్(ఇన్ విట్రో ఫెర్టిలైజేషన్) పద్ధతులు పాటిస్తారు. ఐయూఐలో భర్త నుంచి సేకరించిన వీర్యకణాలను శుభ్రపరచి భార్య అండం విడుదలయ్యే సమయంలో నేరుగా గర్భాశయంలోకి పంపిస్తారు. ఐవీఎఫ్‌లో ల్యాబ్‌లో ఫలదీకరణ చేసి ప్రవేశపెడతారు. ఇలా చేసినందుకు లక్షల్లో ఖర్చు చేయాల్సి ఉంటుంది. సింగిల్, డబుల్, ట్రిపుల్ సిట్టింగ్‌లు అంటూ ఉమ్మడి జిల్లాలో కనీసం రూ.3 లక్షలు నుంచి రూ.5 లక్షల వరకూ వసూలు చేస్తున్నాయి. కచ్చితంగా సంతానం అంటూ కొన్ని సెంటర్లు రూ.10 లక్షల నుంచి రూ.15 లక్షలు వరకూ ఫీజులు నిర్ణయించాయి.



సంతానలేమితో బాధపడుతున్న దంపతులే టార్గెట్‌గా ఇప్పుడు టెస్ట్‌ట్యూబ్ బేబీ సెంటర్లు, ఫెర్టిలిటీ, ఐవీఎఫ్ సెంటర్లు, సంతాన సాఫల్యత కేంద్రాలు ఇలా రకరకాల పేర్లుతో వ్యాపార దందాకు తెరలేపాయి. వీటిల్లో అతి తక్కువ కేంద్రాలు మాత్రమే సంతానం కోసం వచ్చిన దంపతులకు అన్ని విషయాలు వివరించి, వారి అండాలు, వీర్యకణాలు సేకరించి ల్యాబ్‌లో ఫలదీకరించి మహిళల అండా(గర్భా)శయంలోకి ప్రవేశపెట్టడం ద్వారా సంతానభాగ్యం కల్పిస్తున్నారు.ఉమ్మడి జిల్లాలోని కాకినాడ,రాజమహేంద్రవరం, అమలాపురం తదితర ప్రాంతాల్లో పదుల సంఖ్యలో ఫెర్టిలిటీ సెంటర్లు ఉన్నాయి.ఉమ్మడి జిల్లా నుంచి ఎక్కువ మంది వైజాగ్ హైదరాబాదులోని కేంద్రాలకు వెళ్తున్నారు.

(ఆంధ్రజ్యోతి-పిఠాపురం)

అమ్మతనానికో రేటు పెట్టేశారు.. ఇష్టానుసారం అమ్మేస్తున్నారు.. ఐవీఎఫ్ సెంటర్లు పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్నా.. ఒక్కో జంట నుంచి రూ.10 లక్షల నుంచి రూ.15 లక్షల వరకూ లాగేస్తున్నా చూస్తూ ఊరుకుంటున్నారు. పిల్లలు కావాలనే ఆశతో వస్తున్న దంపతుల జీవితాలతో ఆటలాడుకుంటున్నారు.. అయినా అడిగే నాథుడు లేడు..పట్టించుకునే పెద్దాయన లేడు..ఎవరు ఎంత చెబితే అంత.. సికింద్రాబాద్‌లోని ఒక సంతాన సాఫల్యత కేంద్రం లో జరిగిన ఘరానా మోసం ఉమ్మడి జిల్లాలో ప్రకంపనలు రేపుతోంది. మారిన జీవనశైలి కారణంగా నగరాలు, పట్టణాల్లో 30 నుంచి 40 శాతం మంది దంపతులు సంతాన లేమితో ఆసుపత్రులను ఆశ్రయిస్తున్నారు. గ్రామీ ణ ప్రాంతాల్లోనూ ఇటువంటి వారి సంఖ్య పెరుగుతోంది.ఇదే ఐవీఎఫ్, ఫెర్టిలిటీ సెంటర్లకు కాసుల వర్షం కురిపిస్తోంది. పిల్లల కోసమని తమ వద్దకు వచ్చేవారిని వారి అండాలు, శుక్రకణాలతోనే సంతానం కలుగుతుందని చెప్పి అక్రమ మార్గాల్లో దాతలవి వినియోగిస్తూ లక్షల్లో వసూళ్లకు పాల్పడుతున్నారు.

బలహీనతను క్యాష్ చేసుకుని..

పిల్లలు పుట్టలేదని సంతాన సాఫల్య కేంద్రాల వద్దకు వచ్చేవారి బలహీనతను క్యాష్ చేసుకుంటున్నారు. ముందుగా పలు పరీక్షల పేరుతో దందా ఆరంభమవుతుంది.పరీక్షలకే రూ.లక్ష వరకూ లాగేస్తారు. సంతానం కోసం వచ్చే వారి నుంచి రెండు నుంచి మూడేళ్ల పాటు వీలైనంత ఎక్కువ సొమ్ములు లాగడమే లక్ష్యంగా ఎక్కువ కేంద్రాలు నడుస్తున్నాయి. వచ్చిన దంపతులకు వారి వీర్యకణాలు, అండాలు వినియోగిస్తామని చెప్పి డబ్బులు వసూలు చేస్తున్న కేంద్రాలు అసలు విషయాన్ని వారికి చెప్పకుండా మోసాలకు పాల్పడుతున్నాయనే ఆరోపణలున్నాయి. హైదరాబాద్‌లోని సృష్టి టెస్ట్‌ట్యూబ్ బేబీ సెంటర్‌లో ఇదే జరిగింది.ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో 50 కేంద్రాలు ఉండగా కొన్ని కేంద్రాలు ఇదే పద్ధతి అవలంబిస్తున్నాయి. ఆరోగ్యంగా ఉన్న పురుషుల నుంచి వీర్యకణాలు,మహిళల నుంచి అండాలు సేకరిస్తున్నారు. వైద్యానికి వచ్చే దంపతుల అండాలు, వీర్యకణాలు సేకరించి ఏది లోపం ఉంటే అది తీసేసి వేరే వారిది వినియోగించి ఐవీఎఫ్ పద్ధతిలో ఫలదీకరించి మహిళ గర్భాశయంలో ప్రవేశపెడుతున్నారు.విషయం తెలిసినా చాలా మంది బయటకు చెప్పుకోలేకపోతున్నారు.ఇదే సమయంలో వీర్యకణాలు, అండం సేకరించే యువతీ, యువకులకు మితిమీరి ఇంజక్షన్లు చేయడంతో వారు ఆరోగ్య సమస్యలు ఎదుర్కొంటున్నారు.

పర్యవేక్షణ లేక.. ఇష్టారాజ్యం..

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోని నగరాలు, పట్టణాల్లో ఉన్న సంతాన సాఫల్యకేంద్రాలు, ఐవీఎఫ్, ఐయూఐ, టెస్ట్‌ట్యూబ్ సెంటర్ల నిర్వహణపై సరైన పర్యవేక్షణ, నియంత్రణ లేదనే విమర్శలు ఉన్నాయి. నిబంధనల ప్రకారం ఈ కేంద్రాలన్నీ జాతీయ, రాష్ట్రస్థాయిలో అనుమతులు, లైసెన్సులు తీసుకోవాల్సి ఉంటుంది. దాతల వీర్యకణాలు,అండం వినియోగిస్తే అసిస్టెడ్ రీప్రొడక్టివ్ టెక్నాలజీ, రెగ్యులైజేషన్ యాక్ట్ ప్రకారం లైసెన్సు తీసుకుని వాటి మార్గదర్శకాలకు లోబడి కేంద్రాలు నిర్వహించాల్సి ఉంటుంది. ఎక్కువ కేంద్రాలు ఈ నిబంధనలు పాటించడం లేదు.అయినా ఇప్పటి వరకూచర్యలు లేవు. కేంద్రాల పనితీరును నిరంతరం పర్యవేక్షించి మోసాలు జరగకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని పలువురు సూచిస్తున్నారు.

» ఫెర్టిలిటీ మాటున కాసుల వేట
» పుట్టగొడుగుల్లా వెలుస్తున్న వైనం
» ఉమ్మడి జిల్లాలో 50 కేంద్రాలు
» పిల్లల కోసం రూ.లక్షల్లో వసూళ్లు
» పేరుకే ఐయూఐ, ఐవీఎఫ్
» మోసపోతున్న దంపతులు
» సికింద్రాబాద్ ఘటనతో ప్రకంపన

పెళ్లి ఆలస్యమైతే సంతానలేమి..

సొసైటీలో ఇటీవల సంతానలేమి సమస్య బాగా పెరిగింది. పెళ్లయిన జంటలకు నార్మల్‌గా పిల్లలు పుట్టే పరిస్థితి తగ్గుతోంది. ఇది ఆందోళన కల్గించే విషయం. సంతానం కోసం ఐవీఎఫ్, సరోగసీ సెంటర్లను ఆశ్రయిస్తున్నారు. అక్కడ లక్షలు ఖర్చుపెట్టినా పిల్లలు పుడతారనే గ్యారంటీ ఉండడంలేదు. పెళ్లి ఆలస్యంగా చేసుకోవడం కూడా సంతానలేమికి ఒక కారణం. వివాహిత 25 ఏళ్లలోపు పిల్లలను కనడం సరైన సమయం. యువత లైఫ్ స్టైల్ మార్చుకోవాలి.

- బి.అక్కమాంబ, గైనిక్ విభాగం హెచ్‌వోడీ, రాజమహేంద్రవరం జీజీహెచ్

కాకినాడ జిల్లాలో అనధికారికంగా..

కార్పొరేషన్(కాకినాడ), జూలై 27(ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లాలో సంతాన సాఫల్య కేంద్రాల(ఫెర్టిలిటీ/ఐవీఎఫ్ క్లినిక్స్) సంఖ్య గత రెండు దశాబ్దాల్లో క్రమంగా పెరుగుతూ, నూతన వైద్య సాంకేతికతలతో అభివృద్ధి చెందుతోంది. ప్రస్తుతం జిల్లాలో 6నుంచి 8 ప్రధాన ఐవీఎఫ్/ఐవీయూఐ కేంద్రాలు ప్రభుత్వ అనుమతులతో ప్రజలకు సేవలందిస్తున్నాయి. కొన్ని సంస్థలు గుర్తింపు పొందినవిగా నిలిచాయి. వీటితోపాటు కొన్ని చిన్న క్లినిక్‌లు కూడా క్రియాశీలంగా ఎటువంటి అనుమతులు లేకుండా నిర్వహిస్తున్నట్లు సమాచారం

ప్రత్యేకతలు/సేవలు:

ఐవీఎఫ్, ఐసీఎస్ఐ, లేజర్ హ్యాచింగ్, క్రయోప్రిజర్వేషన్, డోనర్ ఎగ్ ఐవీఎఫ్, సరోగసీ వంటి ఆధునిక సేవలు కొన్నికేంద్రాల్లో అందుబాటులో ఉన్నాయి. మరికొన్ని సంస్థలు క్లాస్ 10,000 ఐవీఎఫ్ ల్యాబ్‌తో అంతర్జాతీయ ప్రమాణాల్లో సేవలందిస్తుండగా మరి కొన్ని సంస్థలు 1988 నుంచే పనిచేస్తున్నాయి.

అనుమతులు తప్పనిసరి..

ప్రభుత్వం 2021లో తెచ్చిన ఏఆర్‌టీ యాక్ట్, సరోగసీ రెగ్యులేషన్ యాక్ట్ అధీనంలో ఈ కేంద్రాలు పని చేయాల్సి ఉంటుంది. వీటిద్వారా అన్ని ఐవీఎఫ్ కేంద్రాలు జాతీయ ఏఆర్‌టీ బోర్డు లేదా రాష్ట్ర ఏఆర్‌టీ బోర్డులో రిజిస్టర్ అయిఉండాలి. సురక్షిత వైద్యప్రమాణాలు, శుభ్రత, మెడికల్ కౌన్సెలింగ్, వ్యర్థాల నిర్వహణ వంటి అంశాల్లో స్పష్టమైన నిబంధనలు అమలులోఉన్నాయి. వీటిపై అధికారులు ఏ స్థాయిలో పర్యవేక్షిస్తున్నారు. అనేది ప్రశ్నార్థకంగా ఉంది. ఈ కేంద్రం వల్ల వేలాది కుటుంబాలు ఆశను అందిపుచ్చుకున్నాయి. కొన్ని క్లినిక్‌లు తగిన రిజిస్ట్రేషన్ లేకుండా పనిచేస్తున్నట్టుగా ఆరోపణలు ఉండడంతో అధికారులు క్రమపద్ధతులపై దృష్టిసారిస్తున్నారు.

1.5 లక్షలు చికిత్సలు..

ఇప్పటివరకు జిల్లాలో 1.5లక్షల ఐవీఎఫ్/ఐయూఐ చికిత్సలు జరిగినట్లు సమాచారం. సగటు సక్సెస్ రేటు 50-65 శాతం మధ్యగా నమోదవుతోంది.

ట్రాఫిక్ టెర్రర్‌కు చెక్

» కాకినాడలో ముఖ్యకూడళ్లలో ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు చర్యలు
» 20 జంక్షన్లలో సిగ్నల్స్ ఏర్పాటుకు నగరపాలక అధికారుల కసరత్తు

(కాకినాడ-ఆంధ్రజ్యోతి)

కాకినాడనగరం ట్రాఫిక్ దిగ్బంధంలో చిక్కుకుంది. సాయంత్రమైతే పలు జంక్షన్లు జామ్ అవుతున్నాయి. సెలవు రోజుల్లోనే కాదు.. సాధారణ రోజుల్లో సైతం నగరవాసులు ఈ ట్రాఫిక్ రద్దీలో చిక్కుకొని నరకం చూస్తున్నారు. ఈ నేపథ్యంలో నగరంలోని ముఖ్యమైన కూడళ్లలో ట్రాఫిక్ నియంత్రణకు సిగ్నల్స్‌ను ఏర్పాటు చేయనున్నారు. మొత్తం 20 సెంటర్లలో వీటి ఏర్పాటుకు నగరపాలక సంస్థ అధికారులు చర్యలు చేపడుతున్నారు.

కాకినాడ నగర జనాభా 5లక్షలమందిపైనే.. చుట్టుపక్కల గ్రామాలు నగరానికి అతిచేరువగా మారాయి. నగరంతోపాటు అచ్చంపేట, ఏపీఎస్పీ, రమణయ్యపేట, వలసపాకల, సర్పవరం, ఇంద్రపాలెం, పండూరు, చీడిగ, తూరంగి గ్రామాలనుంచి నగరానికి వచ్చేవారు అధికమయ్యారు. వివిధ పనుల నిమిత్తం వచ్చివెళ్లేవారు సాయంత్రం ఒక్కసారిగా రోడ్డెక్కుతుండడంతో వాహనాలరద్దీ నెలకొంటోంది. 15ఏళ్లక్రితం కాకినాడ మెయిన్‌రోడ్డును విస్తరించారు. అప్పటికీ, ఇప్పటికీ వాహనాల సంఖ్య బాగా పెరిగింది. దీంతో పార్కింగ్ సమస్య నెలకొంటోంది. గతంలో బైక్‌లు ఒకవైపు, కార్లు ఒక వైపు పార్క్ చేసేవారు. ప్రస్తుతం ఒకవైపే పార్క్ చేస్తున్నారు. దీంతో కార్లు ఇతర వాహనాలు సెంటర్ పాయింట్‌కు వచ్చేస్తున్నాయి. వాహనదారులు వెళ్లేందుకు దారి లేకుండా గంటల తరబడి ట్రాఫిక్ నిలిచిపోతోంది.

సిబ్బంది తక్కువ.. సేవలు ఎక్కువ..

కాకినాడ రోడ్లపైకి వేలాదిగా వస్తోన్న వాహనాలను కంట్రోల్ చేయడం ట్రాఫిక్ పోలీసులకు సాధ్యం కావడంలేదు. దీనికి ప్రధాన కారణం సిబ్బంది కొరత. కాకినాడ నగరాన్ని ట్రాఫిక్-1, ట్రాఫిక్-2 ఇలా రెండు సర్కిళ్లుగా విభజించారు. గతంలో ట్రాఫిక్ డీఎస్పీ ఉండేవారు. ఆయనే ట్రాఫిక్‌ను పర్యవేక్షించేవారు. ప్రస్తుతం ఆ బాధ్యతలను సీఐలు నిర్వర్తిస్తున్నారు. దీంతో ట్రాఫిక్-1 సర్కిల్‌లో ఒక సీఐ, ఐదుగురు ఎస్ఐలు, ఏఎస్‌లు నలుగురు, ఉమెన్ ఏఎస్ఐ 1, హెడ్‌కానిస్టేబుళ్లు 11మంది, కానిస్టేబుళ్లు 34మంది, హోంగార్డులు ఆరుగురు ఇలా మొత్తం 62మంది పనిచేస్తున్నారు. ట్రాఫిక్-2 సర్కిల్‌లో ఒక సీఐ, ఇద్దరు ఎస్ఐలు, ముగ్గురు ఏఎస్ఐలు, 11 మంది హెడ్ కానిస్టేబుళ్లు, 25మంది కానిస్టేబుళ్లు, హోంగార్డులు ఐదుగురు ఇలా మొత్తం 47మంది పనిచేస్తున్నారు. ట్రాఫిక్ క్రమబద్ధీకరణతోపాటు నిబంధనలు ఉల్లంఘించే వారిపైన, డ్రంక్ అండ్ డ్రైవ్ కేసుల నమోదు, ట్రాఫిక్ నియమాలపై అవగాహన సదస్సుల నిర్వహణ.. ఇలా అదనపు విధుల భారం అధికమైంది.

నగరంలో పలు జంక్షన్లలో ట్రాఫిక్ సిగ్నల్స్

నగరంలో గతంలో పలుచోట్ల ట్రాఫిక్ సిగ్నల్స్ ఉండేవి. అవి కొన్నిచోట్లకే పరిమితమయ్యాయి. ఇప్పుడు ప్రముఖ కూడళ్లలో ట్రాఫిక్ సిగ్నల్స్ ఏర్పాటుకు నగరపాలక అధికారులు చర్యలు చేపడుతున్నారు. ఇంద్రపాలెం బ్రిడ్జి జంక్షన్, కలెక్టర్ ఆఫీసు, జడ్పీ సెంటర్, బాలాజీ చెరువు సెంటర్, జగన్నాథపురం, అన్నమఘాటీ సెంటర్, మున్సిబ్ జంక్షన్, టౌన్ హాలు జంక్షన్, కల్పనా సెంటర్, డెయిరీ ఫామ్, భానుగుడి, పాత ఎస్పీ ఆఫీసు, నాగమల్లి తోట జంక్షన్, సర్పవరం జంక్షన్, వైఎస్సార్ వారధి ఫ్లైఓవర్, కొండయ్యపాలెంలోని ముత్తావారధి జంక్షన్, సుబ్బయ్యహోటల్‌జంక్షన్, మూడు లైట్ల జంక్షన్ ఇలా మొత్తం 20 ముఖ్యసెంటర్లలో ట్రాఫిక్ సిగ్నల్స్ ఏర్పాటు చేయనున్నారు.

నేడు కలెక్టరేట్‌లో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక

కలెక్టరేట్(కాకినాడ), జూలై 27(ఆంధ్రజ్యోతి): కాకినాడ కలెక్టరేట్‌లో సోమవారం ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్ తెలిపారు. ఈ మేరకు ఆయన ఒక ప్రకటన వెలువరించారు. జిల్లాస్థాయి అధికారులు అందరూ ఈ కార్యక్రమానికి హాజరుకావాలని ఆయన కోరారు. ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమానికి హాజరుకాలేనివారు అర్జీలను meekosam.ap.gov.in వెబ్‌సైట్‌లో నమోదు చేసుకోవచ్చునని పేర్కొన్నారు. అర్జీదారులు తమ అర్జీల పరిస్థితులను తెలుసుకోవాలంటే 1100 నెంబరుకు నేరుగా కాల్ చేయవచ్చునన్నారు.

గొల్లప్రోలులో చోరీ 7

పెద్దాపురంపై దుష్ప్రచారాన్ని మానుకోవాలి ఎమ్మెల్యే చిన రాజప్ప 7

'అఖండ 2' చిత్రీకరణ పూర్తి

ఆరోగ్య ఉపకేంద్రం భవనం
గొడౌన్‌గా మారింది!

ప్రారంభించి 18నెలలైనా వినియోగించని పరిస్థితి.. రేకుల షెడ్డులోనే వైద్యసేవలు


పిఠాపురం మండలం భోగాపురంలో 18నెలల క్రితం ప్రారంభించిన ఆరోగ్య ఉపకేంద్రం


భవనాన్ని వినియోగించకపోవడంతో సంచులు వేసిన దృశ్యం


అద్దెకు తీసుకున్న రేకుల షెడ్డులోనే సేవలందిస్తున్న వైద్యసిబ్బంది

పిఠాపురం, జూలై 27(ఆంధ్రజ్యోతి): లక్షలు వెచ్చించి నిర్మించిన ఆరోగ్య ఉపకేంద్రం భవనాలు ప్రారంభించినా వినియోగించకపోవడంతో కొందరు ప్రైవేటు వ్యక్తులు వాటిని గొడౌన్‌లా మార్చివేశారు. వైద్యసిబ్బంది మాత్రం అద్దె రేకుల షెడ్డులో అరకొర వసతుల మధ్య వైద్యసేవలు అందిస్తున్నారు. పిఠాపురం మండలం భోగాపురంలో వైసీపీ హయాంలో ప్రజలకు వైద్య సేవలు అందించేందుకుగాను రూ.17.50లక్షలతో ఆయుష్మాన్ భారత్‌హెల్త్‌అండ్‌వెల్‌నెస్ సెంటర్ (ఆరోగ్య ఉపకేంద్రం) భవనం నిర్మించారు.దీన్ని 2024, జనవరి నెలలో అప్పటి ప్రజాప్రతినిధులు ప్రారంభించారు. ఇది జరిగి 18నెలలు దాటినా దాన్ని వైద్యఆరోగ్యశాఖకు అప్పగించలేదు. దీంతో వారు అద్దెకు తీసుకున్న రేకులషెడ్డులోనే ఆరోగ్యఉపకేంద్రం నిర్వహిస్తూ వైద్యసేవలు అందిస్తున్నారు. హెల్త్‌అండ్‌వెల్‌నెస్ సెంటర్‌ను కొందరు వ్యక్తులు గొడౌన్‌గా మార్చేసి గోనె సంచులు, ధాన్యం బస్తాలు వేస్తున్నారు. భవనం నిరుపయోగంగా మారడంపై విమర్శలు వస్తున్నాయి. ఉన్నతాధికారులు స్పందించి వినియోగంలోకి తీసుకురావాలని ప్రజలు కోరుతున్నారు.

ఎన్టీఆర్ బీచ్‌కి పోటెత్తిన పర్యాటకులు

సర్పవరం జంక్షన్, జూలై 27(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలోనే ప్రముఖ పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చెందుతున్న కాకినాడ రూరల్ సూర్యారావుపేట సముద్రతీరానికి ఆదివారం వేలాది సందర్శకులు తరలివచ్చారు. ఈ సందర్భంగా సముద్రతీరంలో చిన్నారులు బీచ్‌లోని ఇసుకతో ఆటలతో కేరింతలతో ఉత్సాహంగా గడిపారు. యువకులు బైక్‌లు, బీచ్ వాలీబాల్‌తో సందడి చేశారు. సముద్ర తీరంలో పర్యాటకుల రద్దీ తీవ్రంగా ఉండడం, సముద్రంలో కెరటాల ఉధృతి తీవ్రంగా ఉండడంతో స్నానాలు చేసేందుకు యువత వెళ్లకుండా కాకినాడ మెరైన్ పోలీస్‌స్టేషన్ సీఐ రామ్మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో సిబ్బంది బందోబస్తు నిర్వహించారు. సముద్రం అలలు తీవ్రత అధికంగా ఉందని, సముద్రస్నానాలు చేయరాదని పర్యాటకులను హెచ్చరిస్తూ పహారా కాశారు.


సూర్యారావుపేట వద్ద సముద్రంలో స్నానాలు చేస్తున్న సందర్శకులు

అంతరిక్షం.. అద్భుత అవకాశం!

- అంతరిక్ష విజ్ఞానంపై రాష్ట్రంలో తొలిసారిగా పది జిల్లా కేంద్రాల్లో అవగాహన శిబిరాలు
- రేపు అమలాపురం జడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో నిర్వహణ

అమలాపురం టౌన్, జూలై 27 (ఆంధ్రజ్యోతి): అంతరిక్షంలో ఏం జరుగుతుంది. అక్కడ ఏం ఉంటుంది అనే ఉత్సుకత ప్రతీ విద్యార్థిలోను ఉంటుంది. విద్యార్థి దశ నుంచే అంతరిక్ష పరిశోధనలపై ఆసక్తిని పెంపొందించడంతో పాటు భావి భారత అంతరిక్ష పరిశోధకులుగా తీర్చిదిద్దేందుకు ఓ వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఇస్రో భాగస్వామ్యంతో అమరావతి సైన్స్ సిటీ ఆధ్వర్యంలో ఎంపిక చేయబడ్డ జిల్లా కేంద్రాల్లో తొలిసారిగా అంతరిక్ష అవగాహన శిబిరాలు నిర్వహిస్తున్నట్టు కోనసీమ జిల్లా సైన్స్ అధికారి జీవీఎస్ సుబ్రహ్మణ్యం తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా 10 జిల్లా కేంద్రాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో ఈ శిబిరాలు నిర్వహిస్తారు. సైన్స్ సిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్, అమరావతి పర్యవేక్షణలో సమగ్ర శిక్ష, ముస్కాన్ ఎడ్యుకమ్ ఫౌండేషన్ సహకారంతో నెల రోజుల్లో శిబిరాల నిర్వహణ పూర్తి చేస్తారు.



అంతరిక్ష అవగాహన శిబిరాల్లో ఏర్పాటు చేయనున్న నమూనాలు

ఏం చెప్తారు..?

భవిష్యత్తులో అంతరిక్ష పరిశోధనల్లో విద్యార్థులను శాస్త్రవేత్తలుగా తీర్చిదిద్దే లక్ష్యంతో ఈ కార్యక్రమం చేపట్టారు. ఈనెల 29న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అమలాపురం జిల్లాపరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో జిల్లాస్థాయిలో అంతరిక్ష అవగాహన శిబిరం నిర్వహిస్తారు. ప్రధానంగా ఇస్రో ఇప్పటివరకు చేపట్టిన ప్రయోగాలు, సాధించిన విజయాలు, ఉపగ్రహాలపై నమూనాలతో విద్యార్థులకు వివరిస్తారు. ప్రైవేటు పాఠశాలల విద్యార్థులు కూడా తిలకించవచ్చు. అంతరిక్ష పరిశోధనల్లో జరిగిన అద్భుతాలను తెలియచేస్తారు. స్పేస్ మోడల్స్, విజువల్ డెమోస్, వీడియో ప్రజంటేషన్ ఉంటుంది. సైన్స్ సిటీ నుంచి వచ్చే రిసోర్స్ పర్సన్లు అంతరిక్ష వివరాలను విద్యార్థులకు వివరిస్తారు. రాష్ట్ర వ్యాప్తంగా 3వేల మంది విద్యార్థుల్లో అంతరిక్ష విజ్ఞాన జ్యోతులు నింపాలన్నది లక్ష్యం కాగా ప్రతీ జిల్లా నుంచి 300 మందిని భవిష్యత్తు శాస్త్రవేత్తలుగా ప్రోత్సహించడమే లక్ష్యంగా పేర్కొన్నారు.

అంతరిక్ష విజ్ఞానంపై ఆసక్తిని పెంపొందించడంతో పాటు ఉద్యోగ అవకాశాల కోసం వివరిస్తారని జిల్లా సైన్స్ అధికారి సుబ్రహ్మణ్యం తెలిపారు. కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్, జిల్లా విద్యాశాఖాధికారి షేక్ సలీంబాషా నేతృత్వంలో అమలాపురంలో అంతరిక్ష అవగాహన శిబిరం జరుగుతుంది. శిబిరంలో విద్యార్థులకు అవగాహన కల్పించిన అనంతరం అంతరిక్ష విజ్ఞానంపై క్విజ్ పోటీలు నిర్వహిస్తారు. ఆయా పోటీల్లో పాల్గొన్న విద్యార్థులకు ప్రశంసాపత్రాలు అందజేస్తారు. జిల్లాలో విద్యార్థులు, అంతరిక్ష పరిశోధనలపై ఆసక్తిఉన్నవారు తిలకించాలని కోరారు.

'అఖండ 2' చిత్రీకరణ పూర్తి

మోతుగూడెం, జూలై 27 (ఆంధ్రజ్యోతి): అల్లూరి జిల్లా చింతూరు మండలం మోతు గూడెం పర్యాటక ప్రాంతాల్లో వారంరోజుల పాటు జరిగిన అఖండ2 సినిమా చిత్రీకరణ ముగిసింది. ధారాలమ్మ పిక్నిక్ స్పాట్ వద్ద నటుడు నందమూరి బాలకృష్ణ, యాంకర్ ఝాన్సీ తదితరులపై దర్శకుడు బోయపాటి శ్రీను పలు సన్నివేశాలు చిత్రీకరించారు. హీరో నందమూరి బాలకృష్ణతో పొల్లూరు శ్రీదుర్గా మల్లేశ్వరి ఆలయం ప్రధాన అర్చకుడు అయినవిల్లి కుమార్‌స్వామి శర్మ తదితరులు ఫొటోలు దిగారు. మోతు గూడెం యువకుడు ఆకురాతి అశోక్‌కుమార్ ఆర్మీ ఉన్నతాధికారిగా నటించాడు. అలాగే కాకినాడ, రాజమండ్రికి చెందిన యువకులు 150మందికి ఆర్మీ జవాన్ పాత్రలో నటించే అవకాశం కల్పించారు.



నటుడు బాలకృష్ణతో అర్చకుడు అయినవిల్లి కుమార్‌స్వామి శర్మ

ఉధృతంగా గోదావరి..

కోటిపల్లి పుష్కరాల రేవులో మెట్ల వరకు వరద నీరు

కె.గంగవరం, జూలై 27 (ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లా ధవళేశ్వరం నుంచి సముద్రంలోకి వదులుతున్న వరద నీటితో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కె.గంగవరం మండలం కోటిపల్లి వద్ద గోదావరి ఉధృతంగా ప్రవహిస్తోంది. పుష్కరాల రేవులో మెట్ల వరకు నీరు చేరుకుంది. కోటిపల్లి-ముక్తేశ్వరం ఫెర్రీ రేవులో టికెట్ల విక్రయాల వద్ద ఉన్న సిమెంటు రోడ్డు దాకా వరద నీరు వచ్చింది. సుందరపల్లి వద్ద ఏటిగట్టు బలహీనంగా ఉన్న ప్రదేశంలో ఇసుక బస్తాలు వేసి రక్షణ చర్యలు చేపట్టారు. రెవెన్యూ సిబ్బందిని అప్రమత్తం చేశామని, గోదావరి పరి వాహక ప్రాంత వీఆర్వోలు అప్రమత్తంగా ఉన్నారని తహశీల్దార్ శ్రీరామ్‌ప్రసాద్ తెలిపారు.



పుష్కరాల రేవులో వరదనీరు



కోటిపల్లి వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న గోదావరి



గండిపోశమ్మ ఆలయ గోపురాన్ని తాకిన వరద

దేవీపట్నం, జూలై 27 (ఆంధ్రజ్యోతి): గత 4 రోజుల నుంచి ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలకు అల్లూరి జిల్లా దేవీపట్నం మండలంలో ముంపు పరీవాహక ప్రాంతాలైన కొండమొదలు నుంచి పోశమ్మగండి వరకు వరదనీరు ఉధృతంగా ప్రవహిస్తుంది. ఆదివారం పోశమ్మగండి వద్ద ఆలయ గోపురాన్ని తాకింది. వరద మరింత పెరిగితే ఆలయం పూర్తిగా మునిగిపోయే పరిస్థితి ఉంది.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే చినరాజప్ప

పెద్దాపురంపై దుష్ప్రచారాన్ని మానుకోవాలి

ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప

పెద్దాపురం, జూలై 27 (ఆంధ్రజ్యోతి): చారిత్రక పట్టణంగా పేరొందిన పెద్దాపురంపై దుష్ప్రచారం మానుకోవాలని ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప కోరారు. డీసీసీబీ చైర్మన్ తుమ్మల రామస్వామి (బాబు)తో కలిసి ఆదివారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. పెద్దాపురం అన్ని రంగాల్లో ఎంతో శరవేగంగా అభివృద్ధి చెందుతోందని, ఈ క్రమంలో ఈ పట్టణంపై సామాజిక మాధ్యమాల ద్వారా అసత్య ప్రచారం చేయడం సరికాదన్నారు. ఎప్పుడో జరిగిన ఘటనలను దృష్టిలో ఉంచుకుని ఇప్పుడు ఏదో జరుగుతున్నట్టు చెప్పడం సరికాదన్నారు. సూర్యబలిజ సామాజికవర్గానికి చెందిన వారు ఉన్నత చదువులు చదివి మంచి ఉద్యోగాల్లో స్థిరపడి జీవనం కొనసాగిస్తున్నారన్నారు. పెద్దాపురంపై యూట్యూబర్ తులసీచంద్ చేసిన కథనంపై రాజప్ప అసహనం వ్యక్తం చేశారు. దీనిపై సమగ్ర విచారణ జరిపేలా చర్యలు తీసుకుంటామన్నారు. తుమ్మల మాట్లాడుతూ సామాజిక మాధ్యమాల్లో వస్తున్న తప్పుడు ప్రచారంతో పట్టణ ప్రజలు ఎంతో ఇబ్బంది పడుతున్నారని, పైగా దీన్ని రాజకీయ నాయకులకు ఆపాదించడం సరి కాదన్నారు. విభిన్న సంస్కృతీ, సంప్రదాయాలు కలగలిసిన పెద్దాపురం చరిత్రను దిగజార్చడం ఎంతమాత్రం సరికాదన్నారు. సమావేశంలో ఎమ్మెల్యే తనయుడు రంగనాగ్, కూటమి నేతలు పాల్గొన్నారు.

యూట్యూబర్‌పై చర్యలు తీసుకోవాలి

పెద్దాపురంలో వ్యభిచారం జరుగుతోందని యూట్యూబ్ ద్వారా కథనం ప్రసారం చేసిన తులసీచంద్‌పై చర్యలు తీసుకోవాలని కోరుతూ డీసీసీబీ చైర్మన్ తుమ్మల రామస్వామి (బాబు) ఆధ్వర్యంలో కూటమి నేతలు, సూర్యబలిజ సంఘం సభ్యులు ఆదివారం పట్టణ పోలీస్ స్టేషన్ ఎదుట ఆందోళన చేపట్టారు. దర్గా సెంటర్ నుంచి ర్యాలీగా తరలివచ్చి సీఐ విజయ్‌శంకర్, ఎస్ఐ మౌనికలకు వినతి అందజేశారు. తుమ్మల మాట్లాడుతూ తులసీచంద్ పెద్దాపురం వచ్చి వాస్తవాలు చెప్పాలన్నారు. పలు స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, కూటమి నేతలు పాల్గొన్నారు.

సత్యదేవుడికి రథసేవ



రథంపై విహరిస్తున్న స్వామి,అమ్మవార్లు

అన్నవరం, జూలై 27 (ఆంధ్రజ్యోతి): రత్నగిరివాసుడైన సత్యదేవుడికి ఆదివారం రథసేవ వేడుకగా జరిగింది. ఉదయం 10 గంటలకు స్వామి,అమ్మవార్లను ప్రధానాలయం నుంచి తూర్పురాజగోపురం వద్దకు తోడ్కొనివచ్చారు. సుందరంగా వివిధ పుష్పాలతో అలంకరించిన రథంపై ఆ శీనులు గావించి పండితులు ప్రత్యేకపూజ లు నిర్వహించారు. భక్తుల గోవి ందనామస్మరణలు, పండితుల మంత్రోచ్ఛరణల నడుమ మున్మారు ప్రదక్షిణ గావించారు. అనంతరం హారతులిచ్చిప్రధానాలయానికి తీసుకెళ్లారు.

గొల్లప్రోలులో చోరీ

25 గ్రాముల బంగారు ఆభరణాలు, నగదు అపహరణ

గొల్లప్రోలు, జూలై 27 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా గొల్లప్రోలు నగర పంచాయితీ పరిధి ఎస్సీ కాలనీలో చోరీ జరిగింది. గుడివాడ లోవకుమారి శనివారం రాత్రి పది గంటలకు రోజూ మాదిరిగానే ఇంటి హాలులో కుటుంబ సభ్యులతో కలిసి నిద్రపోయింది. ఆదివారం తెల్లవారుజామున 4గంటలకు కాలకృత్యాలు నిమిత్తం నిద్ర లేచిన సమయంలో బెడ్‌రూమ్‌లోని అల్మారా తెరిచి ఉండటానికి గుర్తించింది. గుర్తుతెలియని వ్యక్తులు అందులో ఉంచిన 25 గ్రాముల బంగారు ఆభరణాలు, సెల్‌ఫోన్, నగదు చోరీ చేసినట్టు గుర్తించింది. బాధితురాలి ఫిర్యాదుతో గొల్లప్రోలు ఎస్ఐ ఎన్.రామకృష్ణ కేసు నమోదు చేశారు.

ఉరేసుకున్న పశ్చిమ బెంగాల్ వాసి



దివాకర్ కుమార్ మృతదేహం

రాజానగరం, జూలై 27 (ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లా రాజానగరం పోలీస్ స్టేషన్ పరిధిలోని కొంతమూరులో ఆదివారం ఓ వ్యక్తి ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పశ్చిమ బెంగాల్‌కు చెందిన దివాకర్ కుమార్ రావణి(21) స్థానిక శ్రీరాజా మెటల్ ఇండస్ట్రీస్‌లో 2 నెలలుగా కూలీ పనులు చేసుకుంటున్నాడు. శనివారం రాత్రి 10.30 గంటల వరకు తోటి కార్మికులతో కలిసి పనిచేశాడు. తెల్లవారుజామున ఇండస్ట్రీలోని ఒక షెడ్‌లో వేలాడుతూ ఉండడం గమనించిన తోటి కార్మికుడు రాజీవ్ కుమార్ సింగ్ ఇండస్ట్రీ యజమాని తాడేపల్లి విజయ్ కుమార్‌కు ఫోన్ ద్వారా సమాచారం అందించాడు. దీంతో విజయ్ కుమార్ వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని ఉరేసుకున్నట్టు గుర్తించాడు. రాజానగరం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రాజమహేంద్రవరంలోని ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఈ మేరకు రాజానగరం ఎస్ఐ నారాయణమ్మ కేసు నమోదు చేసినట్టు సీఐ ఎస్.ప్రసన్న వీరయ్య గౌడ్ తెలిపారు.

భర్త చేతిలో భార్య దారుణ హత్య

కొంతమూరులో ఘటన



ఉషారాణి (ఫైల్)

రాజానగరం, జూలై 27 (ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం రూరల్ మండలంలోని కొంతమూరులో భర్త చేతిలో భార్య దారుణ హత్యకు గురైంది. స్థానిక సంతోష్‌నగర్‌కు చెందిన వేమగిరి ఉషారాణి(28)కి పదేళ్ల కిందట నర్సీపట్నం మండలం గిడుగుటూరు గ్రామానికి చెందిన వేమగిరి మాణిక్యంతో వివాహం జరిగింది. అనంతరం ఇద్దరు కొంతమూరులోని సంతోష్‌నగర్‌లో నివాసం వచ్చారు. మాణిక్యం వెల్డింగ్ పనిచేసుకుని కుటుంబాన్ని పోషించేవాడు. భర్త తరచూ భార్యను అనుమానిస్తూ వేధింపులకు గురిచేసేవాడు. ఈ విషయమై గతంలో మాణిక్యంపై ఉషారాణి రాజానగరం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు కూడా చేసింది. అప్పటి నుంచి మాణిక్యం కుటుంబం వదిలి వేరుగా ఉంటున్నాడు. ఈ నేపథ్యంలో శనివారం రాత్రి 9 గంటల సమయంలో మృతురాలి తల్లి నలమాటి లక్ష్మి మనవడితో కుమార్తె ఇంటికి భోజనం పంపింది. సుమారు రాత్రి 11.30 గంటల సమయంలో మనవడు నిహంత్, మనవరాలు నిస్సి ఇద్దరూ కంగారుగా ఇంటి కొచ్చి అమ్మనాన్నలిద్దరూ గొడవపడ్డారని అమ్మమ్మకు చెప్పారు. అమ్మను నాన్న రాయితో అమ్మ తలపై నాప రాయితో కొట్టినట్టు వివరించారు. దీంతో ఇంటికి వెళ్లి చూడగా అల్లుడు మాణిక్యం అక్కడి నుంచి పరారయ్యాడు. ఉషారాణి ముఖం, తలపై తీవ్రమైన రక్తపు గాయాలై అపస్మారక స్థితికి చేరుకుంది. వెంటనే ఇరుగుపొరుగువారి సాయంతో ఉషారాణిని రాజమహేంద్రవరం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. వైద్యులు పరీక్షలు నిర్వహించి అప్పటికే మృతిచెందినట్టు నిర్ధారించారు. రాజానగరం సీఐ ఎస్.ప్రసన్న వీరయ్య గౌడ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

'జయలక్ష్మి సొసైటీ డిపాజిట్‌దారులకు న్యాయంచేయాలి'

అమలాపురం టౌన్, జూలై 27 (ఆంధ్రజ్యోతి): ది జయలక్ష్మి ఎంఏఎం కోఆపరేటివ్ సొసైటీ డిపాజిట్‌దారులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాలు, కృష్ణా జిల్లాలకు చెందిన బాధితులు డిమాండ్ చేశారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అమలాపురం ఏఎస్ఎన్ కళాశాల ప్రాంగణంలో జయలక్ష్మి సొసైటీ బాధితుల సమావేశం ఆదివారం నిర్వహించారు. 200మంది బాధితులు పాల్గొని భవిష్యత్తు కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేశారు. అమలాపురం బ్రాంచి బాధితుడు టీవీఎస్ ప్రసాదరావు మాట్లాడుతూ ప్రస్తుత బోర్డులో జరుగుతున్న అవకతవకలను సభ్యులకు వివరించారు. స్టీరింగ్ కమిటీ కన్వీనర్ యారంకి రఘుభూషణ్ మాట్లాడుతూ ప్రస్తుతం ఉన్న బోర్డు సభ్యుల అసమర్థత వల్ల బాధితులకు నష్టం వాటిల్లిందన్నారు. తక్షణం బోర్డు సభ్యులు రాజీనామా చేసి కొత్త డైరెక్టర్లకు అవకాశం ఇవ్వాలని, బాధితులకు న్యాయం జరిగేలా చూడాలని కోరారు. గుళ్లపల్లి వెంకట్రామ్ మాట్లాడుతూ పారదర్శకత లేని ప్రస్తుత బోర్డు వల్ల బాధితులకు న్యాయం జరిగే అవకాశం లేదన్నారు. బాధితుల్లో ఇప్పటివరకు 80మంది డిపాజిట్‌దారులు చనిపోయారని వివరించారు. మిగిలిన బాధితులకైనా సత్వర న్యాయం జరిగేలా నూతన బోర్డును ఏర్పాటు చేయాలన్నారు. బాధ్యతలను సక్రమంగా నిర్వర్తించలేని అమలాపురానికి చెందిన ఇద్దరు డైరెక్టర్లను తక్షణం రాజీనామా చేయాలని సమావేశంలో కోరారు. కార్యక్రమంలో డైరెక్టర్లు జోస్యుల స్వామిప్రసాద్, అల్లంరాజు గవర్రరాజుకుమార్, సభ్యులు చక్రవర్తి, బి.సుబ్బారావు, కస్తూరి రవికుమార్, పిల్లి గణేష్, బదిరీ నారాయణ తదితరులు ఉన్నారు.



సమావేశంలో పాల్గొన్న బాధితులు

అక్రమంగా తరలిస్తున్న పశువుల పట్టివేత

ఇద్దరి అరెస్ట్



అరెస్ట్ అయినవారితో పోలీసులు

గండేపల్లి, జూలై 27 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా గండేపల్లి జాతీయ రహదారిపై వాహనాలు తనిఖీ చేస్తుండగా అక్రమంగా తరలిస్తున్న పశువులను గండేపల్లి ఎస్ఐ శివనాగబాబు సిబ్బందితో పట్టుకున్నారు. తుని నుంచి చిలకలూరిపేట తరలిస్తుండగా తమకు వచ్చిన సమాచారం మేరకు పట్టుకున్నామన్నారు. 4 ఆవుదూడలు, 12 ఎద్దు దూడలు తరలిస్తున్న అశోక్ లీలాండ్ వాహనాన్ని సీజ్ చేసి ఇద్దరిని అరెస్టు చేశామన్నారు. కేసు నమోదు చేశామని ఎస్ఐ తెలిపారు.

లారీ ఢీకొని అంగన్వాడీ టీచర్ మృతి

మరొకరికి తీవ్ర గాయాలు



ఘటనా స్థలంలో మేరిబాయి మృతదేహం



ఫైల్‌ఫొటో

కొవ్వూరు/రాజానగరం, జూలై 27(ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లా జాతీయ రహదారిపై గైట్ ఇంజనీరింగ్ కళాశాల సమీపంలో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో అంగన్వాడీ టీచర్ మృతి చెందింది. వివరాలిలా ఉన్నాయి. కొవ్వూరు పట్టణంలోని 16వ వార్డు ఔరంగాబాద్‌కు చెందిన రాచర్ల మేరిబాయి (51) అంగన్వాడీ టీచర్‌గా పనిచేస్తుంది. ఆదివారం రాజానగరం సమీపంలోని పరిజర్లపేటలో ఉన్న సోదరుడి ఇంటికి వెళ్లింది. మరో సోదరుడు పోలవరం జూనియర్ కళాశాలలో కాంట్రాక్టు లెక్చరర్‌గా పనిచేస్తున్న తాతపూడి విజయకుమార్‌తో కలిసి మోటారుసైకిల్‌పై కొవ్వూరు బయలుదేరారు. తిరిగి స్వగ్రామానికి వెళ్తున్న తరుణంలో మార్గమధ్యంలో హైవేపై గైట్ ఇంజనీరింగ్ కళాశాల సమీపంలోకి వచ్చేసరికి వారు ప్రయాణిస్తున్న మోటార్ సైకిల్‌ను లారీ వెనుక నుంచి బలంగా ఢీకొంది. మోటార్ సైకిల్‌పై కూర్చున్న మేరీబాయి పై నుంచి లారీ వెళ్లిపోవడంతో అక్క. డికక్కడే మరణించింది. శరీరం నుజ్జునుజ్జు అయ్యింది. సోదరుడు విజయకుమార్‌కు తీవ్ర గాయాలయ్యాయి. రాజమహేంద్రవరంలోని ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. మేరిబాయికి భర్త డేవిడ్ రాజు, కుమార్తె, కుమారుడు ఉన్నారు. రాజానగరం పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రాజమహేంద్రరం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు.

బండారుపేటలో యువకుడు..



చిన్న (ఫైల్)

కొత్తపేట, జూలై 27 (ఆంధ్రజ్యోతి): కోనసీమ జిల్లా కొత్తపేట మండలం వాడపాలెం గ్రామశివారు బండారుపేటకు చెందిన పంతాడి చిన్న(21) ఆదివారం ఉదయం వాడపాలెం ఏటిగట్టు ప్రాంతంలో ఉన్న పశువుల పాకలో ఉరివేసుకుని మృతి చెందినట్టు ఎస్ఐ జి.సురేంద్ర తెలిపారు. చిన్న నాలుగేళ్ల క్రితం అర్చనను ప్రేమవివాహం చేసుకున్నాడు. శనివారం సాయంత్రం గ్రామంలో జరిగే ఫంక్షన్‌కు వెళ్లి వస్తానని చెప్పి వెళ్లి రాత్రి 11 గంటలు అయినా ఇంటికి తిరిగి రాలేదని తండ్రి తాతారావు తెలిపాడు. ఫోన్ స్విచ్ ఆఫ్ రావడంతో రాత్రంతా గాలించామని, ఆదివారం ఉదయం 5 గంటలకు బండారుపేటకు ఎదురుగా ఉన్న ఏటిగట్టుపై పశువుల పాకలో చిన్న ఉరి వేసుకుని కనిపించాడని చెప్పాడు. ఎస్ఐ ఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. తండ్రి తాతారావు ఫిర్యాదుతో అనుమానాస్పద మృతి కేసుగా నమోదు చేశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కొత్తపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

ఆగి ఉన్న లారీని ఢీకొన్న ఇథనాల్ ట్యాంకర్

రాజానగరం, జూలై 26 (ఆంధ్రజ్యోతి): ఇథనాల్ లోడుతో వెళ్తున్న ట్యాంకర్ తూర్పుగోదావరి జిల్లా జాతీయ రహదారిపై కలవచర్ల కూడలిలో ఆదివారం తెల్లవారుజామున ఆగి ఉన్న లారీని ఢీకొంది. విశాఖపట్నం వైపు నుంచి ఇథనాల్ లోడుతో రాజమహేంద్రవరం వైపుగా వెళ్తున్న ట్యాంకర్ రాజానగరం వద్ద హైవేపై ఆగి ఉన్న లారీని ఢీకొంది. ట్యాంకర్ లారీ క్లీనర్‌కు స్వల్ప గాయాలు కాగా ట్యాంకర్ ముందు భాగం దెబ్బతిన్నది. ప్రమాదం జరిగిన వెంటనే ముందు జాగ్రత్తగా రాజమహేంద్రవరం నుంచి అగ్నిమాపక సిబ్బంది యంత్రం సహాయంతో క్యాబిన్‌ను పూర్తిగా నీటితో తడిపేశారు. ఈ సమయంలో హైవేపై ట్రాఫిక్ నిలిచిపోవడంతో సీఐ ఎస్.ప్రసన్న వీరయ్య గౌడ్ సిబ్బంది సహాయంతో ట్రాఫిక్‌ను నియంత్రించారు. పరిసర ప్రాంతాలవారికిగానీ ఏవిధమైన ప్రమాదం సంభవించకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు.



అమ్మవారికి ప్రత్యేక పూజలు, దర్శించుకుంటున్న భక్తులు

భక్తులతో 'లోవ' కిటకిట



ఆలయానికి రూ.6.90 లక్షల ఆదాయం

తునిరూరల్, జూలై 27 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లాలో ప్రముఖ పుణ్యక్షేత్రం తలుపుల్మ లోవ దేవస్థానానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. ప్రత్యేక క్యూలలో బారులు తీరి అమ్మవారిని దర్శించి మొక్కులు చెల్లించుకున్నారు. ఆరుబయట మామిడితోటలో దేవస్థానం ఏర్పాటు చేసిన గదుల్లో వంటావార్పులు చేసుకుని కుటుంబ సమేతంగా భోజనాలు చేశారు. ఆదివారం ఆలయానికి రూ.6.90 లక్షల ఆదాయం సమకూరినట్టు ఈవో విశ్వనాథరాజు తెలిపారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం



పెద్దాపురం, జూలై 27 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా పెద్దాపురం నుంచి వడ్లమూరు వెళ్లే రహదారిలో వారపు సంత వద్ద పొదల్లో గుర్తు తెలియని మృతదేహం లభ్యమైందని ఎస్ఐ వి.మౌనిక తెలిపారు. మృతుడి వయసు సుమారు 50 నుంచి 60 ఏళ్లు ఉంటుందని, ఆచూకీ తెలిసినవారు 9440904846, 9440904844 నెంబర్లకు ఫోను చేయాలని కోరారు.

మహిళ మెడలో బంగారు గొలుసు చోరీ

కోనసీమ జిల్లా రావులపాలెంలో ఘటన

నిందితుల చిత్రం విడుదల చేసిన పోలీసులు



పోలీసులు విడుదల చేసిన చిత్రం

రావులపాలెం, జూలై 27(ఆంధ్రజ్యోతి): మహిళ మెడలో బంగారు గొలుసు అహరించుకుపోయిన సంఘటనపై రావులపాలెం పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... కోనసీమ జిల్లా రావులపాలానికి చెందిన సత్తి రాజ్యలక్ష్మి స్థానిక కళావెంకట్రావు సెంటర్ సమీపంలో ఓ హోటల్ నిర్వహిస్తోంది. రోజులాగే మోటార్‌సైకిల్‌పై ఆమె ఇంటికి తిరిగి వెళ్తుండగా ఆదివారం రాత్రి 8 గంటల ప్రాంతంలో ఆదిలక్ష్మీనగర్ మూడో వీధిలో ఉన్న బంధువుల ఇంటి వద్ద బైక్ పార్క్ చేస్తుండగా ఆ సమయంలో ఇద్దరు గుర్తు తెలియని వ్యక్తులు వచ్చి ఆమె మెడలో సూత్రలతో ఉన్న బంగారు గొలుసు లాక్కుని పరారయ్యారు. దాని బరువు 5 కాసులు ఉంటుందని, జరిగిన సంఘటనపై బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ శేఖర్‌బాబు పేర్కొన్నారు. సంఘటన జరిగిన ప్రాంతం వద్ద సీసీ కెమెరా పుటేజీలు సేకరించారు. ఇద్దరు వ్యక్తులను గొలుసు లాక్కుని పరారైనట్టు గుర్తించి వారి చిత్రాన్ని విడుదల చేశారు. ఈ వ్యక్తులు ఎవరికైనా కనిపిస్తే వెంటనే 9440796567కు సమాచారం అందించాలని సీఐ కోరారు.

బీచ్ రోడ్డు.. రాళ్లే చూడు..

కాకినాడలో జిల్లా కొత్తపల్లి మండలం ఉప్పాడ నుంచి వాకలపూడి వరకు బీచ్‌రోడ్డు కోతకు గురవుతుంది. సముద్ర అలల ధాటికి రహదారి మొత్తం చెదిరిపడిన రాళ్లే కనిపిస్తున్నాయి. దీంతో వాహనాల రాకపోకలకు ఇబ్బంది తప్పడంలేదు.

–స్టాఫ్ ఫొటోగ్రాఫర్, కాకినాడ



కాకినాడ

• కాకినాడ సిటీ • రూరల్ • పిఠాపురం • పెద్దాపురం

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

పిఠాపురం, జూలై 27 (ఆంధ్రజ్యోతి): పిఠాపురం విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో సోమవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఈపీడీసీఎల్ పెద్దాపురం ఈఈ ప్రభాకర్ తెలిపారు. చిత్రాడ, వెల్దుర్తి ఫీడర్ల పరిధిలో నూతన లైన్ల ఏర్పాటు నిమిత్తం పిఠాపురం బైపాస్ రోడ్డు, భోగాపురం ఆక్వా చెరువులు, ఇల్లింద్రాడ, రాపర్తి వ్యవసాయ కనెక్షన్లకు ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు సరఫరా నిలిపివేస్తామని చెప్పారు.



చండీ హోమం మహా పూర్ణాహుతిలో పాల్గొన్న విజయానంద తీర్థ స్వామి

అనఘా దత్త క్షేత్రంలో ముగిసిన చండీ హోమం

పిఠాపురం, జూలై 27 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని అగ్రహారంలో శ్రీపాదశ్రీవల్లభ అనఘా దత్త క్షేత్రంలో తొమ్మిది రోజులు జరిగిన చండీ హోమం ఆదివారం సాయంత్రం ముగిసింది. మైసూరు దత్త పీఠం ఉత్తరాధికారి దత్త విజయానంద తీర్థ స్వామి మహా పూర్ణాహుతి క్రతువు నిర్వహించారు. చాతుర్మాస్య వ్రత దీక్షలో ఉన్న స్వామిని ప్రత్తిపాడు ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ, పలువురు ప్రముఖులు, అధికారులు దర్శించుకున్నారు. ఎస్జీఎస్ ట్రస్టు చెన్నై, పిఠాపురం శాఖ ఆధ్వర్యంలో దివ్యాంగుల ఉపకరణాల పంపిణీకి అర్హులను గుర్తించేందుకు శిబిరం నిర్వహించారు. 137 మంది దివ్యాంగులను పరీక్షించి వారికి అవసరమైన పరికరాలను గుర్తించారు. వీటిని త్వరలోనే అందజేస్తామని ట్రస్టు ప్రతినిధులు తెలిపారు.



మత్స్యకారులకు నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే వర్మ

మత్స్యకారుల సమస్యల పరిష్కారానికి కృషి: వర్మ

పిఠాపురం, జూలై 27 (ఆంధ్రజ్యోతి): మత్స్యకారుల సమస్యల పరిష్కారానికి కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందని పిఠాపురం మాజీ ఎమ్మెల్యే, టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఎస్వీఎస్ఎన్ వర్మ తెలిపారు. కొత్తపల్లి మండలానికి చెందిన మత్స్యకార గ్రామాల ప్రజలు ఆదివారం వర్మను టీడీపీ కార్యాలయంలో కలిశారు. మత్స్యకారులు వేటకు వెళ్లి తిరిగి వచ్చే సమయంలో హార్బర్ వద్ద బోటు ల్యాండింగ్ సక్రమంగా జరగక ప్రమాదాలు జరిగి మత్స్య సంపద సముద్రంపాలవుతోందని వారు వివరించారు. గతంలో బోటు ల్యాండింగ్ సమయంలో పడవలు తిరగబడి ప్రాణాలు కోల్పోయిన సంగతిని వారు గుర్తు చేశారు. ల్యాండింగ్ వద్ద సముద్రపు కెరటాల ఉధృతి తగ్గేలా చర్యలు తీసుకోవాలని కోరారు. దీనికి వర్మ స్పందిస్తూ ఈ సమస్యపై ఇప్పటికే మంత్రి జనార్దనరెడ్డి, మత్స్య శాఖ అధికారులు వచ్చి పరిశీలన జరిపారని, కాలువల వెడల్పుకు, బోట్ల ల్యాండింగ్‌కు అదనంగా రూ.46కోట్లు అవసరమవుతాయని అంచనా వేశారని తెలిపారు. ఈ నిధులు మంజూరయ్యేలోగా డ్రెడ్జింగ్ చేస్తే బోట్ల ల్యాండింగ్‌కు అనువుగా ఉంటుందని మంత్రి, అధికారుల దృష్టికి తీసుకెళ్లినట్టు చెప్పారు. కార్యక్రమంలో మత్స్యకార నాయకులు సూరాడ రాజు, మేరుగు భూషణం, చోడిపల్లి ప్రసాద్, సీకోటి నానాజీ, రాచపల్లి సనపయ్య, జగన్నాథం తదితరులు పాల్గొన్నారు.

ఎస్ఎఫ్ఐ నగర కమిటీ ఎన్నిక

కలెక్టరేట్ (కాకినాడ), జూలై 27 (ఆంధ్రజ్యోతి): స్థానిక పీఆర్ జూనియర్ కళాశాలలో ఆదివారం ఎస్ఎఫ్ఐ నగర కమిటీ ఎన్నిక జరిగింది. నూతన అధ్యక్ష, కార్యదర్శులుగా వాసుదేవ్, సాహిత్, ఉపాధ్యక్షులుగా అమృత, రాజేష్, గమనవేలు, కరుణ్, సహాయ కార్యదర్శులుగా సత్యం, తేజ, అక్షిత, భువనేశ్వరి ఎన్నికయ్యారు. తొలుత ఎస్ఎఫ్ఐ ప్రతినిధి సంజయ్ సంఘ పతాకాన్ని ఆవిష్కరించి ప్లీనరీని ప్రారంభించారు. కాకినాడ జిల్లా కార్యదర్శి గంగా సూరిబాబు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విద్యారంగాన్ని నాశనం చేస్తున్నాయన్నారు. ఎయిడెడ్ కళాశాలల్లో మధ్యాహ్న భోజన పథకం అమలు చేయట్లేదని, పుస్తకాలు కూడా ఇవ్వట్లేదని ఆరోపించారు. అధిక సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు.

సర్పవరం ఆటోనగర్‌కు వరద ముప్పు!

వేలాది మంది కార్మికులకు జీవనోపాధి కల్పిస్తున్న సర్పవరం ఆటోనగర్‌ను వరద ముంపు సమస్య వెన్నాడుతోంది. ఎగువ ప్రాంతాల నుంచి వస్తున్న వరద నీరు ఆటోనగర్‌లోకి చేరడంతో వాహనాల మరమ్మతులు, వాహనాల బాడీల నిర్మాణం కోసం వచ్చే భారీ వాహనాలు రోజుల తరబడి నీటిలో చిక్కుకుపోతున్నాయి. ప్రధాన డ్రైన్‌తో పాటు డ్రైనేజీ వ్యవస్థ శిథిలావస్థకు చేరడంతో వర్షాలు, వరదలు సంభవించినప్పుడల్లా జలదిగ్బంధంలో చిక్కుకుంటున్నాయి.



ఆటోనగర్‌లో వరద నీటిలో ఓ రహదారి

» ప్రధాన రహదారితో పాటు పలు వీధుల్లో చేరిన వరద నీరు » శిథిలావస్థకు చేరిన డ్రైనేజీ వ్యవస్థ » ఆందోళనలో వాహనాల యాజమానులు

సర్పవరం జంక్షన్, జూలై 27 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ పారిశ్రామిక మౌలిక సదుపాయాల అభివృద్ధి సంస్థ (ఏపీఐఐసీ) 2002లో కాకినాడ రూరల్ మండలం సర్పవరంలో సుమారు 50 ఎకరాల విస్తీర్ణంలో ఇండస్ట్రియల్ పార్కుతో ఆటోనగర్ ఏర్పాటు చేసింది. భారీ వాహనాల మరమ్మతులు, బాడీల నిర్మాణం కోసం ఏపీఐఐసీ ఆధ్వర్యంలో 350 మందికి గ్యారేజీల ఏర్పాటుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సహకారం అందిస్తున్నాయి. సిమెంటు రోడ్లు, డ్రైనేజీలు, విద్యుత్తు తదితర మౌలిక వసతులను ప్రభుత్వం కల్పించింది. ఇక్కడకు మినీ వ్యాన్లు, 10, 12, 16 టైర్లు కలిగిన వాహనాలు బాడీ నిర్మాణం, మరమ్మతుల కోసం వస్తుంటాయి. గ్యారేజీ నిర్వాహకుల ఆధ్వర్యంలో సుమారు 3వేల మందికి పైగా కార్మికులు ఇక్కడ పనిచేస్తూ జీవనోపాధి పొందుతున్నారు. 23ఏళ్ల కిందట నిర్మించిన రోడ్లు, డ్రైనేజీలు శిథిలావస్థకు చేరడంతో వాహనాల రాకపోకలకు తీవ్ర అసౌకర్యంగా ఉంటోంది. ఏటా వర్షం నీరు, ఎగువ ప్రాంతాల నుంచి వచ్చే వరద నీరు ఆటోనగర్‌లోకి ప్రవేశించడంతో ఇక్కడి నుంచి బయటికెళ్లే పరిస్థితి లేక రోజుల తరబడి ముంపులో ఉంటోంది. ఫలితంగా తమ వాహనాలు పాడైపోతున్నాయని యాజమానులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తమ ఉపాధికి ఆటంకం కలుగుతోందని కార్మికులు ఆవేదన చెందుతున్నారు. ఆటోనగర్‌ను ఆనుకుని ఉన్న మేజర్ డ్రైన్ గట్టు జారిపోవడం, శిథిలావస్థకు చేరడంతో ఎగువ ప్రాంతాల నుంచి వరద నీరు నేరుగా పల్లంలో ఉన్న ఆటోనగర్‌కు వస్తోందని గ్యారేజీల నిర్వాహకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దీంతో వాహనాల యాజమానులు మరమ్మతులకు విజయవాడ వెళ్లడంతో ఆర్థికంగా నష్టపోతున్నామని ఆందోళన వ్యక్తం చేశారు. ఇక్కడి నీరు బయటకెళ్లేందుకు పూర్వం నిర్మించిన ఔట్‌పుట్ డ్రెయిన్ శిథిలావస్థకు చేరడం, ఆసుపత్రిలోని చెత్త, వ్యర్థాలను పారేయడంతో డ్రైన్ కప్పడిపోయి నీరు ముందుకెళ్లే పరిస్థితి లేక ముంపు సమస్య తలెత్తుతోంది. ఏటా లక్షలాది రూపాయలను పన్నుల రూపంలో చెల్లిస్తున్నా ఏపీఐఐసీ, పరిశ్రమల శాఖ, ఇతర అధికారులు పట్టించుకోవట్లేదని వాపోయారు.



ఓ వర్క్‌షెడ్డు వద్ద వరద నీరు చేరిన దృశ్యం



రైల్వే ట్రాక్ సమీపంలో ఔట్‌పుట్ డ్రైన్‌లో పూడిక తీయిస్తున్న అధ్యక్షుడు గరగ సత్తిబాబు

శాశ్వత పరిష్కారం చూపాలి

గరగ సత్తిబాబు, ప్రెసిడెంట్, ది కాకినాడ ఆటోనగర్-ఇండస్ట్రియల్ పార్కు ప్లాట్ ఓనర్స్ అసోసియేషన్

వర్షాలు, వరదల సమయంలో ఆటోనగర్ ముంపు బారిన పడడం సర్వసాధారణంగా మారింది. ఎగువ ప్రాంతాల నుంచి వస్తున్న వరద నీరు బయటకెళ్లేందుకు ఔట్‌పుట్ వ్యవస్థ నిర్మించి ముంపు సమస్యను పరిష్కరించాలి. నాలుగు రోజులుగా వరద నీరు రావడంతో డ్రెయిన్‌లో చెత్త తొలగింపునకు చర్యలు తీసుకున్నాం. వరద ముంపు శాశ్వత పరిష్కారం కోసం ఎమ్మెల్యే పంతం నానాజీ, ఏపీఐఐసీ అధికారులు తగిన చర్యలు తీసుకోవాలి.

ఎన్ఎఫ్‌సీఎల్ విశ్రాంత ఉద్యోగుల ఆత్మీయ కలయిక

సర్పవరం జంక్షన్, జూలై 27 (ఆంధ్రజ్యోతి): వారంతా రిటైర్డు ఉద్యోగులు. 34ఏళ్ల క్రితం నాగార్జున ఎరువుల కర్మాగారంలో పని చేశారు. ఆత్మీయ కలయిక కోసం 70 మందితో గ్రూపు ఏర్పాటుచేశారు. 1991-2025 మధ్య పని చేసిన వారంతా ఎస్.రామారావు అధ్యక్షతన ఆదివారం కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 30ఏళ్ల పాటు అంతా కలిసి పని చేశామని, 35 మంది కలవడం ఆనందంగా ఉందన్నారు. ఒకరి కష్టసుఖాల్లో మరొకరు పాలుపంచుకుంటూ సహకారం అందించుకోవాలనే ఉద్దేశంతో ఈ ఆత్మీయ సమ్మేళనం నిర్వహించినట్టు చెప్పారు. భవిష్యత్తులో పలు సామాజిక కార్యక్రమాలు నిర్వహించడంతో పాటు సభ్యుల్లో ఆర్థికంగా వెనుకబడిన వారికి చేయూత ఇవ్వాలని నిర్ణయించారు. తాము పనిచేసిన సమయంలో మధుర జ్ఞాపకాలను గుర్తు తెచ్చుకుని కుటుంబసభ్యుల వివరాలు, ఆరోగ్యంపై చర్చించుకున్నారు. ఆత్మీయ కలయికకు అన్ని విధాలుగా సహకారం అందించిన ఆర్.గోవిందరాజులును సభ్యులు అందరూ అభినందించారు. భోజనం అనంతరం గ్రూప్ ఫొటో తీసుకున్నారు. కార్యక్రమంలో విశ్రాంత ఉద్యోగులు సీహెచ్ విజయకుమార్, పీఎస్ఎన్ రాజు, వై.జోగారావు, వి.అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.



34ఏళ్ల తర్వాత కలుసుకున్న ఎన్ఎఫ్‌సీఎల్ విశ్రాంత ఉద్యోగులు



ష్రింప్ ఫార్మింగ్ విధానాన్ని పరిశీలిస్తున్న మత్స్య శాఖ కమిషనరు రామశంకర్‌నాయక్

పెదపూడిలో మత్స్యశాఖ కమిషనరు పర్యటన

పెదపూడి (కరప), జూలై 27 (ఆంధ్రజ్యోతి): మత్స్య శాఖ కమిషనరు రామశంకర్ నాయక్ ఆదివారం పెదపూడిలో పర్యటించారు. గ్రామానికి చెందిన ఆక్వా రైతు దాట్ల చరణ్‌రాజు వినూత్న విధానంలో చేపడుతున్న రొయ్యల సాగు (ష్రింప్ ఫార్మింగ్)ను పరిశీలించి అభినందించారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించి చేపడుతున్న ఈ విధానంలో అవసరమైన మెళకువలను అందజేసి సందేహాలను నివృత్తి చేశారు. ఎస్ఐఎఫ్‌టీ ప్రిన్సిపాల్ అంజలి, మత్స్య శాఖ జేడీ కృష్ణారావు, ఏడీ కరుణాకర్, ఎఫ్‌డీవో నూకరాజు, వీఎఫ్ఏలు అర్జున్, పరశురామ్ తదితరులు పాల్గొన్నారు.



ప్రతిభావంతుడికి ల్యాప్‌టాప్ బహూకరణ

సర్పవరం జంక్షన్, జూలై 27 (ఆంధ్రజ్యోతి): విద్యలో ప్రతిభ కనబరుస్తున్న విద్యార్థికి ఉపాధ్యాయుల శ్రీనివాస్ తన తల్లిదండ్రుల జ్ఞాపకార్థం ల్యాప్‌టాప్ బహూకరించారు. ఏపీఐఐసీ కాలనీలోని అడబాల ట్రస్టు కార్యాలయంలో అధ్యక్షుడు అడబాల రత్నప్రసాదరావు, జి.కృష్ణమోహన్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో నిమ్మకాయల వెంకటేశ్వరరావు, డాక్టర్ అడ్డాల సత్యనారాయణ, బి.సత్యనారాయణరాజు, చింతపల్లి సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

బీసీ బాలికల వసతిగృహానికి ఫ్యాన్లు బహూకరణ

కాకినాడ సిటీ, జూలై 27 (ఆంధ్రజ్యోతి): జగన్నాథపురంలోని ప్రభుత్వ బీసీ కళాశాల బాలికల వసతిగృహానికి రాజ్యసభ సభ్యుడు సానా సతీష్‌బాబు చేయూత అందించారు. వసతిగృహంలో ఫ్యాన్లు లేక విద్యార్థినులు ఇబ్బందులు పడుతున్న విషయాన్ని తెలుసుకున్న ఎంపీ వెంటనే స్పందించి సానా సతీష్ బాబు ఫౌండేషన్ ద్వారా 9 ఫ్యాన్లు బహూకరించారు. ఫౌండేషన్ చైర్మన్ తలాటం హరీష్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఎంపీ కార్యాలయ ఇన్‌చార్జి మేకా లక్ష్మణమూర్తి, నాయకుడు న్యూటన్ ఆనంద్ తదితరులు వసతిగృహం వార్డెన్ సరస్వతి సమక్షంలో విద్యార్థినులకు ఫ్యాన్లు అందజేశారు. క్రికెట్ కోచ్ చార్లీ, రాజశేఖర్, రామశేషాద్రి తదితరులు పాల్గొన్నారు.

'నారా లోకేశ్ ఫౌండేషన్ సేవలను విస్తరించాలి'

కాకినాడ సిటీ, జూలై 27 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లోని టీడీపీ కార్యాలయంలో మాజీ ఎమ్మెల్సీ టీడీ జనార్దన్‌ను కాకినాడకు చెందిన నారా లోకేశ్ యువజన ఫౌండేషన్ రాష్ట్ర అధ్యక్షుడు మండపాక సుబ్బు మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయన నుంచి ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు అసెంబ్లీ ప్రసంగాల పుస్తకాలు అందుకున్నారు. లోకేశ్ ఫౌండేషన్ ద్వారా ఆంధ్రప్రదేశ్‌లో అందిస్తున్న సేవలను వివరించగా తెలంగాణకూ విస్తరించాలని సూచించారని సుబ్బు చెప్పారు.

సంఘటితంగా ఉండి సంక్షేమానికి పాటుపడదాం

ఆర్యవైశ్యులకు ఆంధ్రప్రదేశ్ ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షుడు సత్యనారాయణ పిలుపు

పిఠాపురం, జూలై 27 (ఆంధ్రజ్యోతి): ఆర్యవైశ్యులంతా సంఘటితంగా ఉండి అన్ని వర్గాల సంక్షేమానికి పాటుడపడుతూ సేవా కార్యక్రమాలు నిర్వహిద్దామని ఆంధ్రప్రదేశ్ ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు చిన్ని రామసత్యనారాయణ పిలుపునిచ్చారు. పట్టణంలోని ఎస్ కన్వెన్షన్ హాలులో ఆదివారం ఆర్యవైశ్య మహాసభ పిఠాపురం, గొల్లప్రోలు, కొత్తపల్లి మండలాల నూతన కమిటీల ప్రమాణస్వీకారం జరిగింది. నూతన కార్యవర్గ ప్రతినిధులతో కాకినాడ జిల్లా అధ్యక్షుడు పులపర్తి కుమార్ ప్రమాణం చేయించారు. జిల్లా ఉపాధ్యక్షుడు వెలగా వెంకటనగేష్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో పిఠాపురం మాజీ ఎమ్మెల్యే ఎస్వీఎస్ఎన్ వర్మ, మహాసభ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గ్రంధి నారాయణరావు (బాబ్జీ), ఆర్యవైశ్య డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ కొత్త కొండబాబు, ప్రతినిధులు పేరూరి గాంధీ, పెనుగొండ కామరాజు, కొత్తకొండబాబు, పేరూరి గాంధీ, భక్తుల సత్తిబాబు, వాకచర్ల సత్యనారాయణ, నార్ల తాతాజీ, ఇమ్మిడిశెట్టి నాగేంద్ర, లలితా ఇండస్ట్రీస్ అధినేత మట్టే శ్రీనివాస్, బోడ సతీష్, మున్సిపల్ కమిషనరు నామ కనకారావు తదితరులు పాల్గొన్నారు.

ఆర్యవైశ్య మహాసభ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి, కోశాధికారులుగా పిఠాపురం మండల రేపాక రమేష్, కంభంపాటి శ్రీరామ్, కంచర్ల నగేష్, కొత్తపల్లి మండలానికి కూరగాయల కృష్ణ, సుతామిల్లి సతీష్, కడిమిశెట్టి వెంకట్రావు, గొల్లప్రోలు మండలానికి ములుకూరి వెంకట్రాజు, కేదారశెట్టి లక్ష్మీప్రసాద్, వెత్సా వీవీ రమణమూర్తి ప్రమాణం చేశారు.



నూతన కార్యవర్గ సభ్యులతో ప్రమాణం చేయిస్తున్న చిన్ని రామ సత్యనారాయణ

'సహకార సంఘాల బలోపేతానికి కృషి'

సామర్లకోట, జూలై 27 (ఆంధ్రజ్యోతి): సహకార సంఘాల బలోపేతానికి కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప పేర్కొన్నారు. జి.మేడపాడు పీఏసీఎస్ చైర్మన్‌గా పాలకుర్తి వీరభవన్నారాయణ (రవిబాబు), సభ్యులుగా జానా వెంకట్రావు, పాలచర్ల వీర్రాజు ప్రమాణస్వీకారం ఆదివారం జరిగింది. వారిని ముఖ్య అతిథులుగా హాజరైన ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప, డీసీసీబీ చైర్మన్ తుమ్మల రామస్వామి (బాబు) పులమాలలతో అభినందించారు. తెలుగు రైతు కాకినాడ పార్లమెంటరీ కమిటీ చైర్మన్ పాలకుర్తి శ్రీనుబాబు, నిమ్మకాయల రంగనాగ్, టీడీపీ నాయకులు తోట కూర శ్రీనివాసు, గోలి శ్రీరామ్‌చౌదరి, కొండపల్లి కృష్ణమూర్తి, పైణ్ణి శ్రీనివాసు, గుమ్మళ్ళ రామకృష్ణ, కంచుమర్తి రాజన్న, కొప్పిరెడ్డి నాగబాబు, రైతులు పాల్గొన్నారు.



జి.మేడపాడు పీఏసీఎస్ పాలకవర్గ ప్రమాణస్వీకారోత్సవంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే చినరాజప్ప

ప్రజా సమస్యల పరిష్కారానికే 'పల్లె నిద్ర'

సర్పవరం జంక్షన్, జూలై 27 (ఆంధ్రజ్యోతి): ప్రజలు, పోలీసుల మధ్య అంతరం తగ్గించేందుకు, ప్రజా సమస్యలను తెలుసుకుని పరిష్కరించేందుకు 'పల్లె నిద్ర' నిర్వహిస్తున్నామని కాకినాడ మెరైన్ సీఐ టి.రామ్మోహన్‌రెడ్డి తెలిపారు. ఆదివారం రాత్రి ఆయన సూర్యారావుపేట శివారు మైనర్ పేటలో స్థానికులతో కలిసి పల్లె నిద్ర (బస) చేశారు. పలువురు మత్స్యకారులు, గ్రామస్తులు తమ సమస్యలను వివరించారు. సముద్రం, సముద్ర తీరంలో అనుమానాస్పద వ్యక్తులు సంచరిస్తే పోలీసులకు సమాచారం అందివ్వాలన్నారు. సముద్ర తీరంలో ఆయిల్ పైపులైన్లు ఉన్నాయని, ఆయిల్‌చోరీకి పాల్పడేవారి సమాచారం అందించాలని, 1093 టోల్‌ఫ్రీ నెంబరుకు కాల్ చేసి పోలీసులకు సహకరించాలని కోరారు. గ్రామస్తులు తన దృష్టికి తీసుకొచ్చిన సమస్య లను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని సీఐ హామీ ఇచ్చారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు, ఏఎస్ఐ మధు, సిబ్బంది పాల్గొన్నారు



మైనర్‌పేటలో స్థానికులతో మాట్లాడుతున్న సీఐ రామ్మోహన్‌రెడ్డి



మరిడమ్మకు ప్రత్యేక పూజలు

పెద్దాపురం, జూలై 27 (ఆంధ్రజ్యోతి): మరిడమ్మ అమ్మవారికి శ్రావణ మాసం సందర్భంగా ఆదివారం ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. దేవస్థానం సహాయ కమిషనరు కమిషనరు కె.విజయలక్ష్మి భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

'అభివృద్ధి, సంక్షేమానికి ప్రాధాన్యం'

సామర్లకోట, జూలై 27 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఆర్థిక పరిస్థితి ఆశాజనకంగా లేనప్పటికీ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు ప్రాధాన్యమిచ్చేందుకు కూటమి ప్రభుత్వం ఎంతగానో కృషి చేస్తోందని పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప పేర్కొన్నారు. సుపరిపాలనలో తొలి అడుగులో భాగంగా ఆదివారం ఆయన అచ్చంపేటలో తన కుమారుడు రంగనాగ్, టీడీపీ మండల నాయకులు తోటకూర శ్రీనివాసు, వింటి బాబ్జీ, అడ్డాల వెంకన్నబాబు కలిసి ఇంటింటికీ తిరిగి ప్రభుత్వ కార్యక్రమాల అమలును వివరించారు. పలు కూడళ్లలో మహిళలు ఎమ్మెల్యేకు మంగళహారతులు ఇచ్చి గజమాలలతో అభినందించారు. రాజా సూరిబాబురాజు, చీకట్ల వెంకటేష్, కొండపల్లి కృష్ణమూర్తి, తోట నాగభూషణం, ఎలిశెట్టి నానీ, ముమ్మిడి సూరిబాబు, పెంకే వెంకటేష్, కుర్రా నారాయణ స్వామి (రాజు) తదితరులు పాల్గొన్నారు.



అచ్చంపేటలో ఎమ్మెల్యే చినరాజప్పకు స్వాగతం పలుకుతున్న మహిళలు



రామేశ్వరంలో అల్లూరి విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి

'అల్లూరి' విగ్రహావిష్కరణ

పెదపూడి (కరప), జూలై 27 (ఆంధ్రజ్యోతి): పెదపూడి మండలం రామేశ్వరంలో విప్లవవీరుడు అల్లూరి సీతారామరాజు విగ్రహాన్ని ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి ఆదివారం ఆవిష్కరించారు. కాకినాడ క్షత్రియ పరిషత్ సౌజన్యంతో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో పరిషత్ సభ్యులు, పెదపూడి మండల కూటమి నాయకులు పాల్గొన్నారు.

పేకాట శిబిరంపై పోలీసుల దాడి

కరప, జూలై 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వేములవాడలో పేకాట శిబిరంపై ఆదివారం కరప పోలీసులు దాడి చేసి పేకాడుతున్న ఐదుగురిని అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి రూ.3,240 నగదు, 104 పేక ముక్కలు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ తోట సునీత తెలిపారు.

'మంత్రి సుభాష్‌పై అభాండాలు మానుకోవాలి'

కాకినాడ సిటీ, జూలై 27 (ఆంధ్రజ్యోతి): అమలాపురంలో దళిత యువకుడిని కొట్టిన ఘటనతో మంత్రి సుభాష్‌కు గానీ, ఆయన కాలేజీకి గానీ ఎటువంటి సంబంధం లేదు. అన్ని వర్గాల అభ్యున్నతికి పాటుపడుతున్న బీసీ మంత్రి సుభాష్‌పై ఇటువంటి అభాండాలు వేయడం మానుకోవాలని రాష్ట్ర బీసీ సంఘం ఉపాధ్యక్షుడు యనమదల రవి, రాష్ట్ర కార్యదర్శి పెంకే రవి, యువజన విభాగం రాష్ట్ర నాయకుడు అనసూరి సతీష్ హితవు పలికారు. భానుగుడి సమీపంలోని సంఘ కార్యాలయంలో జరిగిన జిల్లా సంఘ కార్యవర్గ సమావేశంలో నేతలు మాట్లాడారు. మంత్రి సుభాష్ ఎదుగుదలను చూడలేక లేనిపోని బురదజల్లుతున్నారన్నారు. సమావేశంలో నాయకులు కాదా శివరామకృష్ణ, వెంకీ శివ, విత్తనాల రమణ, కొక్కిలిగడ్డ కాశివర్మ, వాసంశెట్టి మహేష్ తదితరులు పాల్గొన్నారు.

'మాజీ ఎమ్మెల్యే సంగిశెట్టి సేవలు చిరస్మరణీయం'

2పిఠాపురం రూరల్, జూలై 27 (ఆంధ్రజ్యోతి): పిఠాపురం నియోజకవర్గ ప్రజలకు మాజీ ఎమ్మెల్యే సంగిశెట్టి వీరభద్రరావు అందించిన సేవలు చిరస్మరణీయమని పలువురు నాయకులు అన్నారు. సంగిశెట్టి 20వ వర్ధంతి సందర్భంగా బి.కొత్తూరులోని ఆయన విగ్రహానికి ఆదివారం టీడీపీ, జనసేన, వైసీపీ నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. సంగిశెట్టి పెద్ద కుమార్తె తోట జానకి ఆధ్వర్యంలో సర్పంచ్ చక్కా లక్ష్మీచినబాబు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఏఎంసీ మాజీ చైర్మన్ సంగిశెట్టి వెంకటేశ్వరరావు, మున్సిపల్ వైస్ చైరపర్సన్ కొత్తపల్లి పద్మబుజ్జి, మాజీ జడ్పీటీసీ జవ్వాది కృష్ణ మాధవరావు, మాజీ ఎంపీపీ సకుమళ్ల నాగబాబు, ఏలేరు ప్రాజెక్టు కమిటీ మాజీ చైర్మన్ రెడ్డెం భాస్కరరావు, లోకారెడ్డి రామకృష్ణ, కూరాకల చిట్టిబాబు, అరిగెల రామయ్యదొర తదితరులు పాల్గొన్నారు.



బి.కొత్తూరులో మాజీ ఎమ్మెల్యే సంగిశెట్టి విగ్రహానికి నివాళులర్పిస్తున్న నాయకులు



18 కిలోల చేప లభ్యం

దేవీపట్నం, జూలై 27(ఆంధ్రజ్యోతి): మండలంలో పూడిపల్లి పంచాయతీ నేలకోట ఆవలో ఆదివారం వేటగాళ్ల వలలో 18 కిలోల చేప లభ్యమైంది. ఆవలో నేలకోట, గండికోట, గొందూరు గ్రామాల గిరిజనులు రోజూ వేటకు వెళ్తుంటారు. చేప ధర రూ.4వేలు పలకడంతో వేటగాళ్లు ఆనందం వ్యక్తం చేశారు.

రంపచోడవరం

• రంపచోడవరం • మారేడుమిల్లి • రాజవొమ్మంగి • అడ్డతీగల • వై రామవరం • గంగవరం • దేవీపట్నం • చింతూరు • కూనవరం • వీఆర్ పురం • ఎటపాక

ఆదమరిస్తే... అంతే సంగతులు



నందిగామ వద్ద రహదారికి ఇరువైపులా ముళ్ల పొదలు

ఎటపాక, జూలై 27 (ఆంధ్రజ్యోతి): భద్రాచలం-కూనవరం రోడ్‌లో పలు చోట్ల రహదారికి ఇరువైపులా ముళ్ల పొదలు ప్రమాదభరితంగా ఉన్నాయి. ముళ్లపొదలు రహదారిని కనిపించకుండా మూసివేసే పరిస్థితికి రావడంతో రాకపోకలు సాగించే వాహనదారులు భయాందోళన చెందుతున్నారు. ఇదే మార్గాల్లో ప్రమాదకర మలుపు ఉండడంతో మరింత ఆందోళన చెందాల్సిన పరిస్థితి నెలకొంటోంది. ఎటపాక మండలంలో భద్రాచలం-కూనవరం రోడ్‌లో గన్నవరం నుంచి నందిగామ బ్రిడ్జి వరకు 5కిలోమీటర్ల వరకు రహదారి ఇరువైపులు ముళ్లపొదలు, చెట్లు పెరిగి ప్రమాదకరంగా మారాయి. ఈ ప్రాంతాల్లో మూలమలుపులవద్ద ప్రమాద సూచికలు ఏర్పాటు చేయాలని, ముళ్ల పొదలు తొలగించాలని వాహనదారులు కోరుతున్నారు.

ఎమ్మెల్యే శిరీష దేవికి పదవిపై హర్షం

మోతుగూడెం, జూలై 27(ఆంధ్రజ్యోతి): శాసనసభ ఎస్టీ కమిటీ చైర్‌పర్సన్‌గా ఎమ్మెల్యే మిరియాల శిరీషదేవి నియమితులు కావడంపై మోతుగూడెం ఎంపీటీసీ వేగి నాగేశ్వరరావు, డొంకరాయి ఎంపీటీసీ కరకా వెంకట రమణ ఆదివారం హర్షం వ్యక్తం చేశారు. టీడీపీ గ్రామ అధ్యక్షుడు దొడ్డ ఏసు, ఇతర నాయకులు బొడ్డేటి బాబురావు, అంగా శ్రీను ఓలయ్య, ధారబాబు, నీలపు సత్యనారాయణ, ప్రేమ్ కుమార్ హర్షం వ్యక్తం చేసినవారిలో ఉన్నారు.

రాజవొమ్మంగిలో..

రాజవొమ్మంగి, జూలై 27(ఆంధ్రజ్యోతి): గిరిజన సంక్షేమ కమిటీ చైర్‌పర్సన్‌గా ఎమ్మెల్యే శిరీషదేవి నియామకంపై మండలంలో నాయకులు, ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. మండలానికి చెందిన ఎమ్మెల్యే శిరీషదేవికి కీలక పదవి ఇవ్వడంపై టీడీపీ నాయకులు గొల్లపూడి పెద్దిరాజు, దంతులూరి శివ రామచంద్రరాజు, గణజాల తాతరావు హర్షం వ్యక్తం చేశారు.

దేవీపట్నంలో..

దేవీపట్నం, జూలై 27(ఆంధ్రజ్యోతి): అనుసూచిత జాతుల సంక్షేమ కమిటీ చైర్‌పర్సన్‌గా ఎమ్మెల్యే మిరియాల శిరీషదేవి నియామకంపై టీడీపీ మండల కన్వీనర్ మరిశెట్ల వెంకటేశ్వరరావు, దేవీపట్నం సర్పంచ్ కుంజం రాజామణి, ముచ్చు వీరవెంకట సత్యనారాయణ, రేలంగి రాంబాబు హర్షం వ్యక్తంచేశారు.

గంజాయి కేసుల్లో ఉన్న నిందితులకు కౌన్సెలింగ్



మోతుగూడెం, జూలై 27(ఆంధ్రజ్యోతి): ఎస్పీ అమిత్ బర్దర్, చింతూరు అడిషనల్ ఎస్పీ పంకజ్‌కుమార్ మీనా ఆదేశాల మేరకు ఆదివారం డొంకరాయి పోలీస్‌స్టేషన్‌లో వివిధ ప్రాంతాల్లో గంజాయి కేసుల్లో నేరస్థులుగా ఉన్న వారికి డొంకరాయి ఎస్ఐ శివకుమార్ కౌన్సెలింగ్ ఇచ్చారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ గంజాయి కేసుల్లో నిందితులుగా ఉన్న ప్రతిఒక్కరిపై సస్పెక్ట్ షీట్ ఓపెన్ చేసి వారి కదలికలపై నిఘా ఏర్పాటు చేస్తామని హెచ్చరించారు. ఒకటి కంటే ఎక్కువ గంజాయి కేసుల్లో నేరస్థులుగా ఉంటే వారిపై పీట్‌ఎన్‌డీపీఎస్ చట్టం కింద జైల్లో నిర్బంధిస్తామన్నారు.

గోవా గవర్నర్‌గా అశోక్ గజపతిరాజు నియామకంపై హర్షం

రంపచోడవరం, జూలై 27 (ఆంధ్రజ్యోతి): గోవా గవర్నర్‌గా అశోక్ గజపతి రాజు నియామకంపై మాజీ ఎమ్మెల్యేలు శీతంశెట్టి వెంకటేశ్వరరావు, చిన్నం బాబురమేష్ వేర్వేరు ప్రకటనలో హర్షం తెలిపారు. ఆయనకు పదవి రావడం తెలుగు ప్రజలకు గర్వకారణమన్నారు. సీఎం చంద్రబాబు సారథ్యంలో ఉత్తరాంధ్ర అభివృద్ధి పథంలో నడుస్తోందని, ప్రపంచ ప్రఖ్యాత కంపెనీలు టీసీఎస్, కాగ్నిజంట్, గూగుల్ డేలా సెంటర్లు విశాఖకు తరలివచ్చాయన్నారు.

నేటినుంచి ఉపాధి హామీ పనుల ఆడిట్

రాజవొమ్మంగి, జూలై 27(ఆంధ్రజ్యోతి): సోమవారం నుంచి మండలంలో ఉపాధి హామీ సామాజిక తనిఖీ జరగనుంది. ఉపాధి పనుల్లో ఎప్పుడూ ముందంజలో ఉండే రాజవొమ్మంగి మండలంలో ఇటీవల పనులు జరిగే తీరుపై తీవ్ర విమర్శలు వచ్చాయి. పనులు చేయకుండానే బిల్లులు చేసుకున్నారనే ఫిర్యాదులపై అధికారులు ఓ మేట్‌ను తొలగించి ఆమెపై పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు చేయించడం, టెక్నికల్ అసిస్టెంట్‌ను సస్పెండ్ చేయడం, ఇటీవల జరిగిన మండల పరిషత్ సర్వసభ్య సమావేశంలో ఉపాధి పనులపై ప్రజాప్రతినిధులు అసహనం వ్యక్తం చేయడం వంటి సంఘటనలు పనుల్లో అవకతవకలు జరిగాయనే విమర్శలకు బలం చేకూరుస్తున్నాయి. మండలంలో జరుగుతున్న విషయాలు ఐటీడీఏ పీవోకు తెలియడంతో ఆరు నెలల ఉపాధి పనులకు సంబంధించిన మస్తరుచీట్లను తహశీల్దార్ కార్యాలయంలో భద్రపరిచారు. ఆడిట్ నేపథ్యంలో అధికారులకు ఇచ్చేందుకు ఆ రికార్డులను ఉపాధి హామీ అధికారులకు రెవెన్యూ అధికారులు అప్పగించారు. 2024-2025 ఆర్థిక సంవత్సరంలో రోజువారీ వేతనం, మెటీరియల్ పనుల ద్వారా రూ.22కోట్లతో జరిగిన పనులకు ఆడిట్ చేయనున్నారు. సోమవారం నుంచి మూడు రోజుల పాటు మండల కార్యలయంలోనే సమావేశాలు ఉండనున్నాయి.

ఎటపాకలో సీఆర్‌పీఎఫ్ వార్షికోత్సవం



జాతీయ జెండాలతో ర్యాలీ నిర్వహిస్తున్న సీఆర్‌పీఎఫ్ అధికారులు, సిబ్బంది

ఎటపాక, జూలై 27(ఆంధ్రజ్యోతి): ఎటపాకలోని 212 బెటాలియం ఆధ్వర్యంలో ఆదివారం సీఆర్‌పీఎఫ్ 87వ వార్షికోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా బెటాలియన్ అధికారులు, సీఆర్‌పీఎఫ్ సిబ్బంది అమరులకు ఘనంగా నివాళులర్పించారు. కమాండెంట్ క్వార్టర్ గార్డ్‌లో సెల్యూట్ స్వీకరించి వివిధ రంగాల్లో సీఆర్‌పీఎఫ్ సాధించిన విజయాలను కొనియాడారు. 212 బెటాలియన్ పరిధి గ్రామాల్లో సైకిళ్లపై జాతీయ జెండాలతో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో 212 బెటాలియం కమాండెంట్ దీపక్‌కుమార్‌శ్రీ వాస్తవ, డాక్టర్ సుమిత్‌సెహగల్, డిప్యూటీ కమాండెంట్ అజయ్ ప్రతాప్ పాల్గొన్నారు.

బహిరంగ వేలం వాయిదా

దేవీపట్నం, జూలై 27(ఆంధ్రజ్యోతి): మండలంలోని గొందూరులోని గండి పోశమ్మ అమ్మవారి దేవస్థానానికి సంబంధించి వివిధ అంశాలకు ఈనెల 28న జరగాల్సిన టెండర్ కం బహిరంగ వేలాన్ని పరిపాలనా కారణాల దృష్ట్యా వాయిదా వేస్తున్నట్లు జూనియర్ అసిస్టెంట్ కె.వెంకటేశ్వరరావు తెలిపారు. తిరిగి ఎప్పుడు నిర్వహిస్తామో ప్రకటిస్తామని ఆయన చెప్పారు.

జగ్గంపేట

• జగ్గంపేట • తుని • ప్రత్తిపాడు

పొంచి ఉన్న ప్రమాదం!

• చిట్టడువుల్లా మారుతున్న రహదారులు

• పట్టించుకోని ఆర్‌అండ్‌బీ శాఖ



ఏ.కొత్తపల్లిలో రహదారిపైకి చొచ్చుకు వచ్చిన ముళ్లపొదలు

తొండంగి, జూలై 27 (ఆంధ్రజ్యోతి): కోట్లాది రూపాయల వ్యయంతో నిర్మించిన రహదారులను ఆర్‌అండ్ బీ శాఖ పట్టించుకోకపోవడంతో చిట్టడువుల్లా మారుతున్నాయి. ఏ.కొత్తపల్లి నుంచి సీతారాంపురం, కొమ్మనాపల్లి మీదుగా శీల మదుం వరకూ సుమారు 5 కిలోమీటర్ల మేర నిర్మించిన రహదారికి ఇరువైపులా పెద్ద ఎత్తున ముళ్లపొదలు పెరిగి చిట్టడవిని తలపిస్తున్నాయి. ముఖ్యంగా ఏ.కొత్తపల్లి పంగిడి చెరువు నుంచి సీతారాంపురం వరకూ ముళ్ల పొదలు రహదారిపైకి విస్తరించాయి. పాదచారులు, ద్విచక్రవాహనాలు వెళ్లేందుకు ఏర్పాటు చేసిన మార్జిన్‌ను దాటి పొదలు రహదారిపైకి వచ్చినా వాటిని తొలగించేందుకు ఆర్‌అండ్ బీశాఖ శాఖా పరంగా ఏ చర్యలు తీసుకోవడంలేదు. కొన్నిచోట్ల రహదారికి ఇరువైపులా పెరిగిన పొదల వల్ల రహదారి కుంచించుకుపోయింది. ఇదే రహదారి మీదుగా నిత్యం అనేక స్కూల్ బస్సులు వెళ్తుండడంతో పిల్లల కళ్లకు తగిలి దెబ్బతినే ప్రమాదం పొంచి ఉంది. వెంటనే తుప్పలు తొలగించేందుకు చర్యలు తీసుకుని నిర్వహణపై ఆర్ అండ్‌బీ శాఖ దృష్టి పెట్టి రహదారులను కాపాడాలని ప్రయాణికులు కోరుతున్నారు.

పీ4తో పేదలకు ఎంతో ఉపయోగం

ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ



ఆర్థిక సహాయం అందజేస్తున్న ఎమ్మెల్యే కుటుంబం

జగ్గంపేట, జూలై 27 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన అత్యంత ప్రతిష్టాత్మకమైన పీ4 కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వ ఉద్యోగులు ఐదు కుటుంబాలను దత్తత తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. దీనిలో భాగంగా జగ్గంపేట మండలం ఇర్రిపాక గ్రామంలో గుర్తించిన 6 కుటుంబాలకు ఆదివారం కాకినాడ ఎలక్ట్రికల్ ఈఈ ఉదయ్‌భాస్కర్ ఆర్థిక సహాయం చేశారు. ఈఈ కుటుంబీకులు, జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ, మణి దంపతులు చేతులమీదుగా ఒక్కో కుటుంబానికి రూ.10వేలు చొప్పున ఆర్థిక సాయం అందజేశారు. అరవాల అప్పారావు, రామిశెట్టి అప్పారావు, కంద అప్పలరాజు, మాగాపు వెంకటరత్నం, సోమిశెట్టి అన్నపూర్ణ, నాగమల్లి సుబ్బలక్ష్మి, పినేరెళ్లకు జ్యోతుల నెహ్రూ సోదరులు జ్యోతుల సుబ్బారావు, అల్లుడు ఎలక్ట్రికల్ ఉదయభాస్కర్ కుటుంబం ఒక్కొక్కరికి పదివేల రూపాయలు చొప్పున రూ.70వేలు ఆర్థిక సహాయం ఎమ్మెల్యే నెహ్రూ మణి దంపతుల చేతుల మీదుగా అందించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ సీఎం చంద్రబాబు ప్రవేశపెట్టిన పీ4 కార్యక్రమం పేద కుటుంబాలను ఆదుకునేందుకు ఎంతో ఉపయోగపడు తుందన్నారు. నియోజకవర్గంలో 8200 బంగారు కుటుంబాలు ఉన్నాయన్నారు. వాళ్లను ఆదుకునేందుకు బయట నుంచి ఇలాంటి వాళ్లను క్రోడీకరించుకొని పీ4లో భాగం చేస్తామన్నారు. 860 మంది మార్గదర్శులు వచ్చారని, ఆగస్టు 15 లోపు ఎనిమిది వేల మందికి చేయూతనిచ్చే విధంగా ఈ పీ4 కార్యక్రమాన్ని ముందుకు తీసుకువెళ్తున్నామన్నారు. తొలిగా ఈ కార్యక్రమాన్ని ఆదివారం ప్రారంభించడం జరిగిందని ఎమ్మెల్యే పేర్కొన్నారు.

అందరూ భాగస్వామ్యం కావాలి

కోటనందూరు, జూలై 27 (ఆంధజ్యోతి): పీ4కుటుంబాలను దత్తత తీసుకోవడంలో ప్రతిఒక్కరు భాగస్వామ్యం కావాలని తుని రూరల్ సీఐ చెన్నకేశవరావు అన్నారు. ఆదివారం మండంలోని జగన్నాధపురం, కాకరాపల్లిలోని 2 కుటుంబాలను దత్తత తీసుకోవడంతోపాటు తొండంగి మండలంలో రెండు కుటుంబాలను సీఐ దత్తత తీసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దత్తత తీసుకున్న కుటుంబాన్ని పూర్తిస్థాయిలో ఆదుకుంటామని తెలిపారు. అన్నివిధాలుగా ఆర్థిక చేయూతనిస్తామని తెలిపారు. కోటనందూరు పోలీస్‌స్టేషన్ నుంచి ఎస్ఐ 4 కుటుంబాలను, కానిస్టేబుల్ ఒక్కో కుటుంబాన్ని దత్తత తీసుకోవడం పట్ల ఆనందం వ్యక్తం చేసారు. అలాగే పీ4లో ప్రజలందరు భాగస్వామ్యంకావాలని ఆయన కోరారు. కార్యక్రమంలో ఎస్ఐ రామకృష్ణ, మాజీ సర్పంచ్ యర్రబినసత్యనారాయణ, మాతిరెడ్డి బాబులు, గుడివాడ శ్రీను, సామినీడి కృష్ణార్జున, వెలగా వెంకట గణేష్, చింతకాయలనాయుడు పాల్గొన్నారు.



కోటనందూరు: జగన్నాధపురంలో పీ4 కుటుంబాలను దత్తత తీసుకున్న సీఐ చెన్న కేశవరావు

పేకాట శిబిరాలపై దాడులు



కాత్రావులపల్లిలో పేకాట రాయుళ్లను పట్టుకున్న పోలీసులు

జగ్గంపేట, జూలై 27 (ఆంధ్రజ్యోతి): జగ్గంపేట ఎస్ఐ రఘునందన్, సిబ్బందితో కాత్రావులపల్లి గ్రామ శివారు గరువు చెరువు ప్రాంతంలో పేకాట శిబిరంపై దాడి చేసి ముగ్గురిని అరెస్ట్ చేసి వారి నుంచి రూ.5150 స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు. జగ్గంపేట సర్కిల్ పరిధిలో ఎవరైనా జూద క్రీడలు ఆడినా లేదా అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడినా 9440796529 లేదా 100, 112లో సమాచారం అందించాలని సీఐ వైఆర్‌కే.శ్రీనివాస్ తెలిపారు.

గండేపల్లిలో...



గండేపల్లి, జూలై 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నీలాద్రిరావు పేట గ్రామ శివారు పేకాట ఆడుతున్నట్టు సమాచారం రావడంతో ఆదివారం గండేపల్లి ఎస్ఐ యువి శివ నాగబాబు సిబ్బందితో దాడి చేశారు. ముగ్గురిని అరెస్టు చేసి రూ.3010 స్వాధీనం చేసుకున్నారు. దీనిపై కేసు నమోదు చేశామని తెలిపారు.

రౌతులపూడిలో...



రౌతులపూడి, జూలై 27(ఆంధ్రజ్యోతి): మండలంలోని దిగిశివాడ శివారు తాండవ కాలువ గట్టుపై పేకాట శిబిరంపై పోలీసులు దాడి చేశారు. ఎస్ఐ జి.వెంకటేశ్వరరావు సిబ్బందితో దాడి చేశారు. ఆరుగురిని అరెస్టు చేసి రూ.4000 స్వాధీనం చేసుకున్నామన్నారు.

ముద్రగడ కోసం పూజలు

ప్రత్తిపాడు, జూలై 27 (ఆంధ్రజ్యోతి): మాజీ మంత్రి ముద్రగడ పద్మనాభం కోలుకోవాలని కోరుతూ మండలంలోని ధర్మవరం నూకాలమ్మ ఆలయం వద్ద ముద్రగడ అభిమానులు, కార్యకర్తలు 108 కొబ్బరికాయలు కొట్టి పూజలు నిర్వహించారు. తీవ్ర అనారోగ్యానికి గురైన ముద్రగడ సంపూర్ణ ఆరోగ్యం తో సురక్షితంగా ఇంటికి రావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ బొల్లు సీతారామరాజు, ఎంపీటీసీ జువ్వల సుజాత బాబులు, సొసైటీ మాజీ అధ్యక్షుడు జువ్వల చినబాబు, గ్రామపెద్దలు దొడ్డిపట్ల సోమన్న దొర, బొల్లు నానిబాబు, సిద్దా విజయ్‌బాబు, సానా తాతీలు, రాపా గుర్రాజు, చల్లా సత్తిబాబు, బొల్లు తాతాజీ, రామారావు ఉన్నారు.



ధర్మవరం నూకాలమ్మ ఆలయం వద్ద పూజలు చేస్తున్న అభిమానులు

రైతు ఆనందంగా ఉంటేనే రాష్ట్రం సుభిక్షం

మాజీ మంత్రి యనమల రామకృష్ణుడు



కార్యక్రమంలో మాట్లాడుతున్న యనమల

తునిరూరల్, జూలై 27 (ఆంధ్రజ్యోతి): రైతు ఆనందంగా ఉంటేనే రాష్ట్రం సుభిక్షంగా ఉంటుందని టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు, మాజీ మంత్రి యనమల రామకృష్ణుడు అన్నారు. తుని పట్టణ శివారు సాయివేదికలో ఎస్.అన్నవరం పీఏసీఎస్ అధ్యక్షుడు పదవీ ప్రమాణ స్వీకార కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా యనమల హాజరయ్యారు. యనమల మాట్లాడుతూ రైతు ప్రభుత్వంపై ఆధారపడకుండా ఉండాలంటే సహకార రంగం బలోపేతంగా ఉండాల్సిన అవసరం ఉందని అన్నారు. సొసైటీ అధ్యక్షుడిగా పోలిశెట్టి రామలింగేశ్వర రావు, డైరెక్టర్లుగా దారకొండ వెంకట రమణ, అనిమిరెడ్డి మల్లి బాబు ప్రమాణస్వీకరం చేశారు. టీడీపీ మండలాధ్యక్షుడు చితంనీడి అబ్బాయి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో డీసీసీబీ చైర్మన్ తుమ్మల బాబు, తోట నగేష్ సీనియర్ నేతలు యనమల రాజేష్, సుర్ల లోవరాజు, మోతుకూరి వెంకటేష్, ఇనుగంటి సత్యనారాయణ కుసుమంచి శోభారాణి, నార్ల భువన సుందరి పాల్గొన్నారు.

శాసన సభ సంయుక్త కమిటీలో ఎమ్మెల్యే సత్యప్రభ



ప్రత్తిపాడు ఎమ్మెల్యే సత్యప్రభను సన్మానిస్తున్న టీడీపీ నాయకులు

ప్రత్తిపాడు, జూలై 27 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ శాసన సభ సంయుక్త కమిటీలో స్త్రీ, శిశు, వికలాంగుల, వయోవృద్ధుల కమిటీ సభ్యురాలిగా ఆదివారం ప్రత్తిపాడు ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ రాజా నియమితులయ్యారు. రాష్ట్ర శాసన సభ నుంచి ఈ మేరకు ప్రత్తిపాడులోని ఎమ్మెల్యే సత్యప్రభకు ఉత్తర్వులు అందాయి. ఎమ్మెల్యే మాట్లాడుతూ మహిళలు, పిల్లలు, వికలాంగులు, వృద్ధుల సంక్షేమానికి తన వంతు కృషి చేస్తానని.. హక్కుల కోసం, సంరక్షణ కోసం సాయిశక్తుల పనిచేస్తానని తెలిపారు. తనకు ఈ అవకాశం కల్పించిన సీఎం చంద్రబాబుకు ఎమ్మెల్యే కృతజ్ఞతలు తెలిపారు. ఎమ్మెల్యేను టీడీపీ సీనియర్ నాయకులు కొమ్ముల కన్నబాబు, మీసాల రాజు, సూది బూరయ్య, అమ రాది వెంకట్రావు, తమరాన సత్యనారాయణ, పర్వత సురేష్, బద్ది రామారావు, వెన్నా శివ, ఉల్లి వీరభద్రరావు సన్మానించారు.

పురగిరి క్షత్రియులు సంఘటితంగా ఉండాలి

సంఘ రాష్ట్ర అధ్యక్షుడు రాఘవరావు

ప్రత్తిపాడు, జూలై 27 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని పురగిరి క్షత్రియులు(పెరికి)సంఘటితంగా ఐక్యమత్యంతో ఉండాలని సంఘ రాష్ట్ర అధ్యక్షుడు కత్తిక రాఘవరావు పిలుపునిచ్చారు. ప్రత్తిపాడులోని బీవీఆర్ కన్వెషన్ హాల్లో ఆదివారం పురగిరి క్షత్రియ కాకినాడ సంఘం ఎన్నిక ఏకగ్రీవంగా నిర్వహించారు. నూతన అధ్యక్షుడు వనపర్తి వీరభద్రరావు(బద్రి), జిల్లా అధ్యక్షుడిగా మరో 70 మంది కార్యవర్గ సభ్యులతో పదవి ప్రమాణ స్వీకారం చేశారు. రాష్ట్ర అధ్యక్షుడు మాట్లాడుతూ పెరికిల సంక్షేమ అభివృద్ధికి సంఘం పనిచేస్తుందని తెలిపారు. రాష్ట్ర కార్యదర్శి నరిశెట్టి చంద్రశేఖర్, రాష్ట్ర నాయకులు ర్యాలి సూర్యనారాయణ, తిబిరిశెట్టి వెంకటేశ్వరరావు, యడ్ల సుబ్రహ్మణ్యం, వీర్లంక సూరిబాబు, బిట్టు రమేష్, ధనేకుల భద్రం, మదినే దొరబాబు, విశాఖపట్నం, అనకాపల్లి, తూర్పుగోదావరి, కోనసీమ, పశ్చిమగోదావరి జిల్లాల నుంచి సంఘ ప్రతినిధులు తరలిరాగా వందలాది మంది పెరికీల సామాజిక వర్గీయులు పాల్గొన్నారు.



ప్రత్తిపాడులో రాష్ట్ర పెరికి సంఘం అధ్యక్షుడు కత్తిక రాఘవరావును సన్మానిస్తున్న నాయకులు

రౌడీ షీటర్లకు కౌన్సెలింగ్



కోటనందూరు పోలీస్‌స్టేషన్‌లో రౌడీ షీటర్లకు కౌన్సిలింగ్ ఇస్తున్న ఎస్ఐ

కోటనందూరు, జూలై 27 (ఆంధ్రజ్యోతి): రౌడీ షీటర్లు చట్టవ్యతిరేక కార్యకలాపాలైన మాదకద్రవ్యాలు, భూ ఆక్రమణల జోలికి వెళితే కఠినచర్యలు చేపడతామని ఎస్ఐ టి రామకృష్ణ తెలిపారు. ఆదివారం కోటనందూరు పోలీస్‌స్టేషన్‌లో రౌడీ షీటర్లకు కౌన్సిలింగ్ నిర్వహించారు. ఎస్ఐ మాట్లాడుతూ చెడు నడవడికపై నిరంతం నిఘా కొనసాగుతుందన్నారు. ప్రతిఒక్కరు గమనించుకుని చెడు అలవాట్లకు దూరంగా ఉండి సమాజంలో జనాలతో కలిసి మంచిపేరు తెచ్చుకోవాలన్నారు.

అనుమానిత ప్రాంతాల్లో ఆకస్మిక తనిఖీలు

జగ్గంపేట, జూలై 27 (ఆంధ్రజ్యోతి): జగ్గంపేట ఎస్ఐరఘునందన్ రావు, సిబ్బందితో ఆదివారం అనుమానిత ప్రాంతాల్లో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఎవరైనా జగ్గంపేట సర్కిల్ పరిధిలో జూద క్రీడలైన గుండాట, పేకాట, బొమ్మా బొరుసు, కోడి పందాలు, ఎత్తులాట, క్రికెట్ బెట్టింగులకు పాల్పడితే జగ్గంపేట సీఐ 94407 96529, 100 లేదా 112కి జిల్లా పోలీస్ వాట్సాప్ నంబర్ 94949933 233కు సమాచారం అందించాలని సీఐ కోరారు.

ఉచిత నేత్ర వైద్య శిబిరం

రౌతులపూడి, జూలై 27 (ఆంధ్రజ్యోతి): రౌతులపూడిలో శ్రీహర్ష ఇంగ్లీషు మీడియం స్కూల్ నందు ఆదివారం ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహించారు. కాకినాడకు చెందిన శ్రీకిరణ్ కంటి వైద్య సిబ్బంది వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. ఆపరేషన్ అవసరమయ్యే వారిని గుర్తించి కాకినాడ తరలించారు. శిబిరాన్ని కరస్పాండెంట్ కొరుప్రోలు బుజ్జీబాబు నాయుడు, ప్రిన్సిపాల్ గాలి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సినీ నటుడు రవితేజకు తుమ్మలపల్లి పరామర్శ



రవితేజతో తుమ్మలపల్లి రమేష్

జగ్గంపేట, జూలై 27 (ఆంధ్రజ్యోతి): సినీ నటుడు రవితేజ తండ్రి రాజగోపాల్ రాజ్ ఇటీవల మరణించడంతో శనివారం హైదరాబాద్‌లో రవితేజ నివాసంలో దశదిన కార్యక్రమం నిర్వహించారు. జనపార్టీ జనసేన ఇన్‌చార్జి హాజరై రవితేజను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. వెంట సురేష్ రాజు, బాబు, మాదారపు వీరబాబు ఉన్నారు.

తంటికొండ దేవస్థాన కమిటీ నియామకం

జగ్గంపేట, జూలై 27 (ఆంధ్రజ్యోతి): తంటికొండ శ్రీదేవి భూదేవి సమేత శ్రీ వేంకటేశ్వర స్వామి దేవస్థానానికి కమిటీ సభ్యులను జగ్గంపేట ఎమ్మెల్యే, టీటీడీ బోర్డు మెంబర్ జ్యోతుల నెహ్రూ నియమించారు. టీడీపీ యువ నేత బద్దిరెడ్డి అచ్చన్నదొరను చైర్మన్‌గా నియమించారు. ఆదివారం ఉదయం తంటికొండ వేంకటేశ్వరస్వామి గుడి వద్ద కొబ్బరికాయలు కొట్టి అచ్చన్న దొర ఆధ్వర్యంలో 30 కార్లు, 20 బైకులతో భారీగా ర్యాలీ నిర్వహించి జగ్గంపేట రావులమ్మనగర్‌లోని ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీస్ వద్దకు చేరుకుని నెహ్రూను కలిశారు. నూతన కమిటీకి టీడీపీ జిల్లా అధ్యక్షుడు జ్యోతుల నవీన్ శుభాకాంక్షలు తెలిపారు.

జగ్గంపేట సొసైటీ చైర్మన్ ప్రమాణ స్వీకారం

జగ్గంపేట, జూలై 27 (ఆంధ్రజ్యోతి): జగ్గంపేట సొసైటీ చైర్మన్‌గా జగ్గంపేట మండలం నరేంద్రపట్నానికి చెందిన బుర్రి సత్యనారాయణ, త్రిసభ్య కమిటీ సభ్యులు నంద చిరంజీవి, జనసేన పార్టీ నుంచి పాలిశెట్టి సతీష్‌లతో కలిసి ఆదివారం ప్రమాణ స్వీకార మహోత్సవం జరిగింది. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ, సొసైటీ మాజీ చైర్మన్ మణి దంపతులు, డీసీసీబీ చైర్మన్ తుమ్మల బాబు, జిల్లా టీడీపీ అధ్యక్షుడు జ్యోతుల నవీన్ వచ్చారు.

లంపకలోవ పీఏసీఎస్ త్రిసభ్య కమిటీ ప్రమాణ స్వీకారం

ప్రత్తిపాడు, జూలై 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని లంపకలోవ ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం త్రిసభ్య కమిటీ ప్రమాణ స్వీకార మహోత్సవం ఆదివారం నిర్వహించారు. లంపకలోవ పీఏసీఎస్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే సత్యప్రభ రాజా విచ్చేశారు. చైర్మన్‌గా వరుపుల రామకృష్ణ, డైరెక్టర్లుగా మదినే దొరబాబు, కంచుపాటి సూరిబాబులు పదవీ ప్రమాణస్వీకారం చేశారు. సొసైటీ నూతన పాలక వర్గాన్ని ఎమ్మెల్యే అభినందించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ సొసైటీ అభివృద్ధికి పాలక మండలి కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో కాకినాడ పార్లమెంటరీ టీడీపీ ఉపాధ్యక్షుడు కొమ్ముల కన్నబాబు, కూటమి నాయకులు మేడిశెట్టి సూర్యకిరణ్ (బాబి), దాసం శేషారావు,త్తరకంచి సర్పంచ్ మంతెన వెంకటరమణ, వరుపుల సాయితరణిత్, ఆనంద్‌న్యూటన్, సొసైటీకి చెందిన ఆది విష్ణు సిబ్బంది పాల్గొన్నారు.